ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 134, పేజీలు - 08

ఆదివారం, నవంబర్ 15, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD



దేశంలో ఫాసిస్టులు ఆగడాలు పెరిగిపోయాయి



- భారత్ సమ్మిట్‌లో రాహుల్ గాంధీ

- ద్వేషంతో కాదు, ప్రేమతోనే పోరాటం

- 2014 ఎన్నికల్లో అవకతవకలు

- ఐటీలో హైదరాబాద్, బెంగళూరు టాప్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లో ఏర్పాటుచేసిన భారత్ సమ్మిట్‌లో లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ రాజకీయాల్లో ఫాసిస్టులకు చోటులేదని అన్నారు. గత పదేళ్లుగా దేశంలో ఫాసిస్టుల గొంతు గట్టిగా వినిపిస్తోందని, వీరి వల్ల వ్యవస్థలు ధ్వంసమవుతున్నాయని కాంగ్రెస్ అగ్రనేత ఆరోపించారు. సమాజంలో, వ్యాపారంలో, విద్యా సంస్థల్లో, రాజకీయాల్లో అన్నీ తమకే తెలుసునని భావించే వ్యక్తులు ఉంటారని, రాజకీయాల్లో అటువంటి వారిని 'ఫాసిస్టులు' అని పిలుస్తామని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. వ్యవస్థలు కుప్పకూలినప్పుడు నియంతృత్వ ధోరణులు బయటకు వస్తాయని, ఇతరుల మాట వినకుండా కేవలం అరవడం మాత్రమే వారి లక్షణమని ఆయన విమర్శించారు. భారత ప్రజాస్వామ్య భవిష్యత్తు అనేది కేవలం దేశానికే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. తనకు భారత ప్రజాస్వామ్యంపై అపారమైన నమ్మకం ఉందని అన్నారు."2014 పార్లమెంట్ ఎన్నికలు గతంలో ఎన్నడూ లేనివిధంగా జరిగాయి.. రూ.వందల కోట్లు ఖర్చుపెట్టారు.. ఆ ఎన్నికల్లోనే భారత ప్రజాస్వామ్య వ్యవస్థ ధ్వంసమైంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లోనూ అవకతవకలు జరిగాయి. మహారాష్ట్ర పార్లమెంట్ ఎన్నికల్లో మహాయుతి కూటమి ఎక్కువ సీట్లలో విజయం సాధించింది. అనంతరం కొద్ది నెలలకే జరిగిన శాసనసభ ఎన్నికల్లో

2లో..



అందరికీ ఓటు హక్కు అదే మా ఆకాంక్ష!

- భారత్ సమ్మిట్-2026లో సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు

- 70 దేశాల నుంచి వెయ్యి మందికి పైగా ప్రతినిధులకు ఆహ్వానం

- కేంద్రం పలువురి వీసాలు రద్దు చేసిందని ఆరోపణ

- ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శ

- రాహుల్‌గాంధీ పోరాటానికి అండగా ఉంటామని స్పష్టీకరణ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగ విలువలు, సామాజిక న్యాయం కోసం ప్రపంచ దేశాలన్నీ కలిసికట్టుగా పోరాడాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యానికి, నియంతృత్వ ధోరణులకు మధ్య ప్రపంచవ్యాప్తంగా పోరాటం కొనసాగుతోందని పేర్కొన్నారు. హైదరాబాద్ వేదికగా నిర్వహించిన భారత్ సమ్మిట్-2026 ముగింపు సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ ప్రజల ప్రాథమిక హక్కులు, ప్రజాస్వామ్య వ్యవస్థ పరిరక్షణపై కీలక వ్యాఖ్యలు చేశారు.

వెయ్యి మందికి ఆహ్వానం.. పలువురికి వీసాల రద్దు

రాజ్యాంగాన్ని, చట్టబద్ధ పాలనను కాపాడటమే తమ ప్రధాన లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచి, అధికారాన్ని కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. భారత్ సమిట్‌కు 70 దేశాల నుంచి వెయ్యి మందికిపైగా ప్రతినిధులను ఆహ్వానించామని, అయితే వారిలో చాలామందికి కేంద్ర ప్రభుత్వం వీసాలు రద్దు చేసిందని ఆరోపించారు. వీసాలు లభించని వారు సైతం ఈ సమిట్ కార్యక్రమాలను

2లో..

హామీల అమలుపై రాహుల్ సమాధానం చెప్పాలి

- ఆరు గ్యారెంటీల అమలుపై కేటీఆర్ ప్రశ్నాస్త్రాలు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. హైదరాబాద్ పర్యటనలో ఉన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో, ఆరు గ్యారెంటీలు, వివిధ సామాజిక వర్గాలకు ఇచ్చిన డిక్లరేషన్ల అమలుపై ఎక్స్ వేదికగా ప్రశ్నల వర్షం కురిపించారు. హామీలు, డిక్లరేషన్ల పేరుతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిని నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు.

42 శాతం రిజర్వేషన్ల హామీ ఏమైంది.?

తెలంగాణ ఖజానా ఖర్చుతో హైదరాబాద్‌లో పర్యటిస్తున్న రాహుల్‌గాంధీ ముందుగా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలపై సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ డిక్లరేషన్లలో పేర్కొన్న అంశాల అమలుపై నిలదీశారు. బీసీలకు రూ.లక్ష కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని ప్రకటించి, మూడేళ్లలో రూ.5 వేల కోట్ల కంటే తక్కువే కేటాయించారని ఆరోపించారు. బీసీలకు విద్య, ప్రభుత్వ కాంట్రాక్టుల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీ ఇప్పటికీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు. ఎస్సీ,

2లో..

పంచాయతీ ఎన్నికలను తేలిగ్గా తీసుకోవద్దు



- కూటమి బలపరిచిన అభ్యర్థులే గెలవాలి

- పరిషత్, మున్సిపల్ ఎన్నికల్లో కూటమి ప్రభంజనం

- గ్రామాల్లోనూ ప్రభంజనం కొనసాగాలన్న టీడీపీ అధినేత

- ఎట్టి పరిస్థితుల్లో గొడవలకు పోవద్దన్న ముఖ్యమంత్రి

అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల జరిగిన మున్సిపల్, పరిషత్ ఎన్నికల్లో ప్రజలు కూటమి ప్రభుత్వానికి చారిత్రక విజయాన్ని అందించారని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. పార్టీ ముఖ్యనేతలతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 94 మున్సిపాలిటీల్లో, 3,235 వార్డుల్లో ఎన్డీఏ అభ్యర్థులు ఘన విజయం సాధించారని తెలిపారు. అలాగే 575 జడ్పీటీసీ స్థానాలు, 7,500 కంటే ఎక్కువ ఎంపీటీసీ స్థానాల్లో కూటమి నిలబెట్టిన

2లో..

తెలంగాణలో గిగ్ కార్మికుల కోసం

ప్రత్యేక చట్టం

- ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా తోపాటు పలు కీలక హామీలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) యాప్ ఆధారిత డెలివరీ, రవాణా తదితర రంగాల్లో పనిచేస్తున్న లక్షలాది మంది గిగ్ కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్‌న్యూస్ తెలిపింది. గిగ్ కార్మికుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. హైదరాబాద్‌లోని జయభేరి గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన గిగ్ వర్కర్ల బహిరంగ సభలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలిసి 'గిగ్ వర్కర్ల సామాజిక భద్రత, సంక్షేమ పథకాన్ని' అధికారికంగా ప్రారంభించారు. గిగ్ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక పాలసీ తీసుకువచ్చింది. ఈ పాలసీలో భాగంగా 12 ప్రధాన హామీలు అమలుకు తీసుకువచ్చింది. ఈ పాలసీ ద్వారా కార్మికులకు ఉద్యోగ

2లో..

అభ్యర్థులు కోరితే నామినేషన్లకు ప్రత్యేక ఎస్కార్ట్

- ఏకగ్రీవ పంచాయతీలకు ప్రోత్సాహక నగదు పెంపు



అమరావతి (ప్రశ్న న్యూస్) ఇటీవల జరిగిన ఎన్నికల్లో పల్నాడు నుంచి రాయలసీమ వరకు కొన్ని చోట్ల అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకున్న క్రమంలో సమస్యాత్మకమైన 12 జిల్లాల ఎస్పీలతో ప్రత్యేకంగా మాట్లాడామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా తెలిపారు. గ్రామ పంచాయతీలతో పాటు పెండింగ్‌లో ఉన్న పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై తిరుపతి కలెక్టరేట్‌లో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. 12 జిల్లాల పోలీసు ఉన్నతాధికారులు హాజరైన ఈ సమావేశంలో, ఎన్నికల నిర్వహణలో భాగంగా శాంతిభద్రతల పరిరక్షణపై ప్రధానంగా చర్చించారు. భేటీ అనంతరం మీడియాతో మాట్లాడిన ఎస్ఈసీ అనిల్ చంద్ర పునేఠా పంచాయతీ ఎన్నికల సమయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. దాడి ముప్పు ఉందని అభ్యర్థులు జిల్లా ఎస్పీకి విజ్ఞప్తి చేస్తే, నామినేషన్ల సమర్పణకు ప్రత్యేక ఎస్కార్ట్‌తో పాటు తగిన భద్రత కల్పిస్తామని ఎస్ఈసీ భరోసా ఇచ్చారు.

2లో..

రేవంత్ రెడ్డి నిరంకుశ

వైఖరికి ఇది నిదర్శనం

- బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ హౌస్ అరెస్ట్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తెలంగాణ పర్యటన నేపథ్యంలో ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి.రాహుల్ గాంధీ పర్యటనపై బీజేపీ అభ్యంతరం వ్యక్తం చేసింది.రాహుల్ గాంధీ పర్యటనకు వ్యతిరేకంగా శాంతియుత నిరసనకు బీజేపీ తెలంగాణ శాఖ పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తెలంగాణ పోలీస్ శాఖ అప్రమత్తమై బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావును పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్‌కు వ్యతిరేకంగా,

2లో..

రాజకీయాల్లో పోటీ..

2లో..

అభివృద్ధిలో సహకారం

- మోదీతో సాన్నిహిత్యంపై డీకే శివకుమార్



ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్‌కు చెక్

- కూడళ్ల విస్తరణకు చర్యలు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో నిత్యం వేధిస్తున్నట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపేందుకు సైబరాబాద్ నగరపాలక సంస్థ (సీఎంసీ) ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే కూడళ్లను గుర్తించి వాటిని శాస్త్రీయ పద్ధతిలో అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా తొలి విడతలో ఎనిమిది ప్రధాన కూడళ్లను అభివృద్ధి చేయనుంది.



2లో..

తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్‌గా బీఎం సందీప్

- అధిష్ఠానం కీలక నిర్ణయం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో రాహుల్ గాంధీ పర్యటన సమయంలో కాంగ్రెస్ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌గా కొనసాగిన మీనాక్షి నటరాజన్‌ను ఆ బాధ్యతల నుంచి తప్పిస్తూ ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. కర్ణాటకకు చెందిన సీనియర్ నేత బి.ఎం. సందీప్‌ను తెలంగాణ కాంగ్రెస్ నూతన ఇన్‌ఛార్జ్‌గా నియమించింది. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ శనివారం నాడు ఉత్తర్వులు జారీ చేయగా, ఈ నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని అధిష్ఠానం స్పష్టం చేసింది. కొన్నాళ్లుగా తెలంగాణ కాంగ్రెస్ లో ఏం జరుగుతుందని ఉత్కంఠ

2లో..

దేశంలో ఫాసిస్టులు ఆగడాలు పెరిగిపోయాయి

ఓడిపోయాం అప్పుడు కూడా అనేక అక్రమాలకు పాల్పడ్డారు. మూడు నెలల వ్యవధిలో 70 లక్షలకు పైగా ఓట్లను చేర్చారు, అదనంగా చేర్చిన ఆ ఓట్ల ద్వారానే బీజేపీ గెలిచింది వ్యవస్థలు ఇంతలా నాశనమవుతున్నా మనది ప్రజాస్వామ్యం అని గొప్పలు చెప్పుకొంటున్నాం. రాజకీయాలంటే గట్టిగా మాట్లాడటం, పదునైన విమర్శలు చేయడం కాదు.12 ఏళ్ల కిందట 600వ స్థానంలో ఉన్న గౌతమ్ అదానీ ఇప్పుడు ఎక్కడున్నారు. నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత సంపన్నుల జాబితాలో అదానీ రెండో స్థానంలోకి ఎగబకారు, ఏ రంగంలో చూసినా అదానీ పెట్టుబడులే మోదీ ప్రధాని అయ్యాక ఆయన వ్యాపారం బాగా పెరిగింది. విమానాశ్రయాలు, పోర్టులు, మౌలిక వసతులు అన్ని కాంట్రాక్ట్‌లు అదానీకి అప్పగించారు. లబ్ధి పొందిన పారిశ్రామికవేత్తలు వ్యవస్థలను మేనేజ్ చేస్తున్నారు" అని రాహుల్ దుయ్యబట్టారు. ప్రపంచ ఐటీ శక్తి కేంద్రంగా హైదరాబాద్ ఎదుగుదలను ఉదహరిస్తూ.. హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాల రూపాంతరానికి దోహదపడిన ఆర్థిక నమూనా 2008 ఆర్థిక సంక్షోభం తర్వాత ఎలా మారిపోయిందో, దాని పర్యవసానాలు ప్రజాస్వామ్య సంస్థలపై ఎంతటి ప్రభావం చూపిందో వివరించారు.

అందరికీ ఓటు హక్కు అదే మా ఆకాంక్ష!

వీక్షిస్తున్నారని తెలిపారు.

ఎంపిక చేసిన వారికే ఓటు అనడం వారి భ్రమ

ప్రస్తుతం దేశంలో రెండు విభిన్న ఆలోచనా విధానాలు కొనసాగుతున్నాయని రేవంత్‌రెడ్డి అన్నారు. ఒక వర్గం ప్రజాస్వామ్య పరిరక్షణను కోరుకుంటుంటే, మరో వర్గం ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేయాలని చూస్తోందని విమర్శించారు. అందరికీ ఓటు హక్కు ఉండాలన్నదే తమ ఆకాంక్ష అని, ఎంపిక చేసిన వారికే ఓటు హక్కు ఉండాలన్నది ప్రత్యర్థుల ఆలోచనగా అభివర్ణించారు. ప్రజల కోసం రాహుల్‌గాంధీ చేస్తున్న పోరాటానికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని స్పష్టం చేశారు. తమను అడ్డుకోగలమని కొందరు భావిస్తున్నారని, అది వారి భ్రమ మాత్రమేనని వ్యాఖ్యానించారు.

సామాన్యుల సంక్షేమమే ప్రభుత్వాల లక్ష్యం కావాలి

పేదలు, మహిళలు, మైనారిటీలు, రైతులు సహా సమాజంలోని అన్ని వర్గాల హక్కులను ప్రభుత్వాలు పరిరక్షించాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రజల ఆకాంక్షలు, ప్రాథమిక హక్కులు, విద్య, ఉపాధి, వైద్యం, ద్రవ్యోల్బణం వంటి సమస్యలు ప్రపంచవ్యాప్తంగా ఒకే విధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ అంశాలపై పోరాటానికి రాహుల్‌గాంధీ నాయకత్వం వహిస్తున్నారని, ఆయనకు అందరూ మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వాలు సంపన్నుల ప్రయోజనాల కోసం కాకుండా సామాన్య ప్రజల సంక్షేమం, అభ్యున్నతి కోసం పనిచేయాలని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

పంచాయతీ ఎన్నికలను తేలిగ్గా తీసుకోవద్దు

అభ్యర్థులు జయకేతనం ఎగురవేశారని వివరించారు. ఈవీఎంలు అయినా, బ్యాలెట్ పేపర్లు అయినా, చివరకు పోస్టల్ బ్యాలెట్లలోనైనా ప్రజలు కూటమికే సంపూర్ణ మద్దతు పలికారన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వల్లే గతంతో పోలిస్తే కూటమికి ఓటు బ్యాంకు ఏకంగా 25 శాతం పెరిగిందని చంద్రబాబు తెలిపారు. ఉద్యోగులంతా ప్రభుత్వ విధానాలకు మద్దతుగా నిలిచారని, వైసీపీ తప్పుడు ప్రచారాలను ప్రజలు ఏమాత్రం నమ్మలేదని పేర్కొన్నారు. సుమారు 7 జిల్లాల్లో కూటమి క్లీన్ స్వీప్ చేసిందని, ముఖ్యంగా అనకాపల్లి, మార్కాపురం జిల్లాల ప్రజలు 100 శాతం స్ట్రైక్ రేట్ ఇచ్చారని గుర్తుచేశారు. పోలవరం ఎడమ కాల్వ ద్వారా అనకాపల్లికి నీటిని అందించడం, మార్కాపురం కొత్త జిల్లా ఏర్పాటు, వెలిగొండ ప్రాజెక్ట్ ఫేజ్-1 ఫలాలు ఈ ఫలితాల్లో స్పష్టంగా ప్రతిబింబించాయని విశ్లేషించారు.రాబోయే రోజుల్లో జరగనున్న మరో 23 పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థులు తిరుగులేని విజయం సాధించాలని నేతలకు దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ ఎన్నికలను ఏమాత్రం తేలిగ్గా తీసుకోవద్దని హెచ్చరించారు. గ్రామాల్లో కూడా కూటమి బలపరిచే అభ్యర్థులే గెలవాలని, క్షేత్రస్థాయిలో ప్రజల ఆదరణ ఉన్న మంచి వ్యక్తులను, విద్యావంతులను, యువతను ప్రోత్సహించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సరైన నాయకులను తీర్చిదిద్దుకోవడానికి ఈ ఎన్నికలు చక్కటి అవకాశమని, రాబోయే 30 ఏళ్లకు ఉపయోగపడేలా బలమైన నాయకత్వాన్ని నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. కేంద్రం, రాష్ట్రం, మున్సిపాలిటీలు, జిల్లా పరిషత్‌లలో ఇప్పటికే ఎన్డీఏ అధికారంలో ఉందని, పంచాయతీల్లోనూ మన అభ్యర్థులు గెలిస్తే పాలన, అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగంగా, సజావుగా ముందుకు సాగుతాయని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రజల మనోభావాలకు అనుగుణంగా పనిచేసినంత కాలం వారు మన వెంటే ఉంటారని స్పష్టం చేశారు. కొందరు కావాలనే హింసను నమ్ముకుంటారని, కానీ కూటమి పూర్తిగా ప్రజాస్వామ్యాన్ని మాత్రమే నమ్ముతుందని చెప్పారు. నాయకులెవరూ ఎట్టి పరిస్థితుల్లోనూ గొడవలకు పోవద్దని, చెడ్డ పేరు తెచ్చుకోవద్దని గట్టిగా హెచ్చరించారు. అధికారాన్ని కేవలం ప్రజలకు మంచి చేయడానికి, వారికి మరింత చేరువ కావడానికి మాత్రమే ఉపయోగించుకోవాలని సీఎం హితవు పలికారు. గెలిచిన ఎంపీటీసీలు, జడ్పీటీసీలు నిరంతరం ప్రజల్లో ఉంటూ పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

అభ్యర్థులు కోరితే నామినేషన్లకు ప్రత్యేక ఎస్కార్ట్

మరోవైపు, ఏకగ్రీవ ఎన్నికలను ప్రోత్సహిస్తూ పంచాయతీరాజ్ శాఖ తాజాగా కొత్త జీవో జారీ చేసిందని ఏపీ ఎస్ఈసీ అనిల్‌చంద్ర పునేఠా వెల్లడించారు. దీని ప్రకారం ఏకగ్రీవమైన గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహక నిధులు అందిస్తుందని తెలిపారు. 5 వేల వరకు జనాభా ఉన్న గ్రామాలకు రూ. 15 లక్షలు, ఐదు వేల నుంచి పది వేల వరకు జనాభా ఉన్న గ్రామాలకు రూ. 25 లక్షల చొప్పున నిధులు మంజూరవుతాయని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 15 నుంచి 20 శాతం గ్రామాల్లో ఎన్నికలు ఏకగ్రీవమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయని ఎస్ఈసీ అభిప్రాయపడ్డారు.

ఏకగ్రీవ గ్రామ పంచాయతీలకు ప్రోత్సాహక నగదు పెంపు

రానున్న గ్రామ పంచాయతీల ఎన్నికల్లో ప్రోత్సాహక నగదు పెంచుతూ ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలన్నీ ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామ పంచాయతీలకు అందించే ప్రోత్సాహక నగదు మొత్తాలను పెంచుతూ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా జి.ఓ.ఆర్.టి. నెం.1111 జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం, గ్రామ పంచాయతీల జనాభా ప్రాతిపదికన ప్రోత్సాహక నగదు మొత్తాల వివరాలు ఇలా ఉన్నాయి.

గ్రామ పంచాయతీల జనాభా - లభించే ప్రోత్సాహక నగదు

2,000 లోపు జనాభా ఉంటే రూ.15 లక్షలు 2,001 – 5,000 వరకు జనాభా ఉంటే రూ.15 లక్షలు 5,001 – 10,000 వరకు జనాభా ఉంటే రూ.25 లక్షలు 10,000 పైచిలుకు జనాభా ఉంటే రూ.50 లక్షల ప్రోత్సాహక నగదు ఆంధ్రప్రదేశ్‌లో మలి విడత మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు సంబంధించిన షెడ్యూల్ విడుదలైంది. రాష్ట్రంలోని 4 కార్పొరేషన్లు, 19 మున్సిపాలిటీల పరిధిలో శనివారం ఉదయం 11 గంటల నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. అభ్యర్థుల నుంచి సోమవారం మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు.సుప్రీంకోర్టు సూచనల నేపథ్యంలో, అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా ఎవరూ అడ్డుకునే పరిస్థితులు తలెత్తకుండా రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా అదనపు నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు, అవసరమైన చోట జిల్లా కలెక్టరేట్లలోనూ నామినేషన్లు స్వీకరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీని ప్రకారం శ్రీకాకుళం మేయర్ అభ్యర్థుల నామినేషన్లను కలెక్టరేట్‌లోనూ స్వీకరించనుండగా, బీ.కొత్తకోట, కందుకూరు, పొదిలి నియోజకవర్గాలకు సంబంధించి కూడా కలెక్టరేట్లలో ప్రత్యేక నామినేషన్ కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చారు.

తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్‌గా బీఎం సందీప్

నెలకొంది. మీనాక్షి నటరాజన్ పార్టీకి అందుబాటులో లేకపోవడం, విద్యా కోర్సు నిమిత్తం విదేశాలకు వెళ్లడంతో పాటు రాష్ట్రంలో పార్టీ నేతలు, కేంద్ర అధిష్టానం మధ్య సమన్వయ లోపం తలెత్తడంతో ఇంఛార్జ్ విషయంలో మార్పులు చేసినట్లు తెలుస్తోంది. పార్టీలో పరిణామాలు ఏ స్థాయికి చేరాయంటే మంత్రిని సైతం పదవి నుంచి తొలగించాల్సి వచ్చింది. మరోవైపు పలువురు ఎమ్మెల్యేలు తీవ్ర వ్యాఖ్యలు చేస్తుండటంతో కాంగ్రెస్ హైకమాండ్ ఈ మార్పునకు శ్రీకారం చుట్టింది. ఇటీవల తెలంగాణ కాంగ్రెస్‌లో సీనియర్ నేతలు, రాష్ట్ర మంత్రుల మధ్య నెలకొన్న అంతర్గత విభేదాలు, నామినేటెడ్ పదవుల భర్తీలో జరుగుతున్న జాప్యంపై ఏఐసీసీ ఫోకస్ చేసింది. దాంతో తెలంగాణలో పార్టీ వ్యవహారాలను పర్యవేక్షించే పూర్తిస్థాయి నేత లేకపోవడంతో, సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి, టీపీసీసీకి మధ్య బలమైన వారధిగా పనిచేసేందుకు సందీప్‌ను అధిష్టానం రంగంలోకి దించింది.

ఎవరీ సందీప్.. ఆయన బ్యాగ్రౌండ్ ఏంటీ.?

తెలంగాణ కాంగ్రెస్ ఇంఛార్జ్‌గా నియమితులైన బి.ఎం. సందీప్ కుమార్ కర్ణాటకలోని చిక్కమగళూరు ప్రాంతానికి చెందిన నేత. పార్టీ సంస్థాగత వ్యవహారాల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న నేత, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సొంత రాష్ట్రానికి చెందిన వ్యక్తి. జాతీయ స్థాయిలో ఏఐసీసీ కార్యదర్శిగా మహారాష్ట్ర సహా పలు కీలక రాష్ట్రాల బాధ్యతలను విజయవంతంగా నిర్వహించిన అనుభవం ఆయన సొంతం. గతంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించిన సంస్థాగత వ్యవహారాలను పర్యవేక్షించడం, టీపీసీసీ కమిటీల కూర్పులో సైతం సందీప్ పాత్ర ఉంది. అందరినీ కలుపుకుపోయే తత్వం ఉన్న నేతను కీలకమైన తెలంగాణ కాంగ్రెస్ ఇంఛార్జ్ పదవి వరించింది.

హామీల అమలుపై రాహుల్ సమాధానం చెప్పాలి

ఎస్టీ పేద కుటుంబాలకు అంబేద్కర్ అభయహస్తం పథకం కింద రూ.12 లక్షలు అందిస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. ప్రభుత్వ కాంట్రాక్టుల్లో 31 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీ కూడా ముందుకు సాగడం లేదని ఆక్షేపించారు.

రెండేళ్లలో రెండు లక్షల ఉద్యోగాల హామీ ఏమైంది?

యూత్ డిక్లరేషన్‌లో భాగంగా 365 రోజుల్లో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని కాంగ్రెస్ ప్రకటించిందని కేటీఆర్ గుర్తుచేశారు. ఇప్పటివరకు కేవలం 10 వేల ఉద్యోగాలే ఇచ్చారని ఆరోపించారు. రాజీవ్ యువ వికాసం, ఐదు లక్షల విద్యా భరోసా కార్డుల హామీల అమలులోనూ ప్రభుత్వం సాధించింది శూన్యమని విమర్శించారు. మైనార్టీలకు బడ్జెట్‌లో రూ.4 వేల కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చి, రూ.వెయ్యి కోట్లలోపే ఖర్చు చేశారని ఆరోపించారు. ఇలా నెరవేర్చని హామీల జాబితా, తెలంగాణకు కాంగ్రెస్ చేసిన ద్రోహ గాథలా అంతులేకుండా ఉందని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

మూడు బడ్జెట్లపై సమీక్ష జరపాలి

మరోవైపు, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడు బడ్జెట్ల పనితీరును సమీక్షించి, ప్రభుత్వాన్ని జవాబుదారీగా నిలదీయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు రాహుల్‌గాంధీకి సూచించారు. కేవలం బడ్జెట్ ప్రకటనలు చేయడం కాకుండా, కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. పేద కుటుంబాలు, భూమిలేని వ్యవసాయ కూలీలు, నిరుద్యోగ యువత కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు కోసం ఇంకా ఎదురుచూస్తూనే ఉన్నారని హరీశ్‌రావు పేర్కొన్నారు.

తెలంగాణలో గిగ్ కార్మికుల కోసం ప్రత్యేక చట్టం

భద్రత, రూ.5లక్షల ప్రమాద బీమాతో పాటు పలు సంక్షేమ ప్రయోజనాలను అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం దీనిని అమల్లోకి తెచ్చింది. ఈ కార్యక్రమం ద్వారా అసంఘటిత రంగంలోని గిగ్ వర్కర్లకు ఆర్థిక, సామాజిక భరోసా లభించనుంది.

గిగ్ కార్మికుల కోసం రెస్ట్ హౌస్‌లు ఏర్పాటు

గిగ్ వర్కర్ల సమస్యలు, వారి కష్టాలు తనకు తెలుసని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. గిగ్ వర్కర్లకు కాంగ్రెస్ పార్టీ, తెలంగాణ ప్రభుత్వం అండగా నిలుస్తాయని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. దేశంలో ఇప్పటివరకు గిగ్ వర్కర్లకు సంబంధించిన సమగ్ర సమాచారం, డేటా అందుబాటులో లేదని చెప్పుకొచ్చారు.ఒక్కో డెలివరీకి ఎంత సమయం పడుతోంది, అందుకు ఎంత పారితోషికం లభిస్తోంది అనే వివరాలు కూడా కార్మికులకు తెలియని పరిస్థితి నెలకొందని, కష్టపడేది కార్మికులైనా, వారి శ్రమకు సంబంధించిన సమాచారం మాత్రం వారి వద్ద ఉండటం లేదని రాహుల్ గాంధీ చెప్పుకొచ్చారు. తెలంగాణ ప్రభుత్వం గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు.ప్రతి డెలివరీకి సంబంధించిన చెల్లింపుల వివరాలను కార్మికులకు తెలియజేస్తోందని వెల్లడించారు. ఎండల్లో మోటార్ సైకిళ్లపై తిరుగుతూ విధులు నిర్వహించే గిగ్ వర్కర్లకు విశ్రాంతి తీసుకునేందుకు గతంలో సరైన సదుపాయాలు లేవని, ఇప్పుడు హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని ఇతర నగరాల్లో ప్రభుత్వం రెస్ట్ హౌస్‌లు ఏర్పాటు చేసిందని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తెలియజేశారు.

గిగ్ కార్మికులను బానిసలుగా మారిస్తే సహించం

గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం గతంలో జరిగిన సమావేశంలో ఇచ్చిన హామీని నేడు నెరవేరుస్తున్నామని రాహుల్ గాంధీ తెలిపారు.కేంద్ర ప్రభుత్వ విధానాలు కేవలం కంపెనీలకు మాత్రమే లబ్ధి చేకూర్చేలా ఉన్నాయని ధ్వజమెత్తారు. కేంద్రంలోని మోడీ సర్కార్, ఆర్ఎస్ఎస్ గిగ్ వర్కర్స్‌ను వెట్టిచాకిరీ కార్మికులుగా మార్చాలని, మిమ్మల్ని అణచివేయాలని చూస్తోందంటూ సంచలన ఆరోపణలు చేశారు. కానీ గిగ్ కార్మికులను బానిసలుగా మార్చాలని, దోపిడీ చేయాలని చూస్తే ఎప్పటికీ సహించేది లేదని రాహుల్ గాంధీ హెచ్చరించారు. మిమ్మల్ని సేవకులుగా కాదు అభివృద్ధిలో భాగస్వాములుగా తీర్చిదిద్దుతామని చెప్పుకొచ్చారు. మీ హక్కులు, కుటుంబాల విద్య, వైద్యం, సంక్షేమానికి అండగా నిలుస్తామని రాహుల్ గాంధీ భరోసా ఇచ్చారు.

ఫోన్‌లోనే అన్ని వివరాలు అందుబాటులోకి

గిగ్ వర్కర్లకు రక్షణ కల్పించాలన్నదే కాంగ్రెస్ పార్టీ ప్రధాన ఆలోచన అని, గిగ్ వర్కర్లకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పూర్తి అండగా నిలుస్తుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భరోసా కల్పించారు. ప్రతి డెలివరీలో ఒక శాతం డబ్బు గిగ్ వర్కర్ల బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని సభలో ప్రకటించారు. ఈ కొత్త చట్టం ద్వారా గిగ్ వర్కర్ల సమాచార వివరాలను సులభంగా పొందవచ్చని వెల్లడించారు. డెలివరీ, శ్రమ, ప్రతిఫలానికి సంబంధించిన సమస్త వివరాలు ఇకపై నేరుగా గిగ్ వర్కర్ల మొబైల్ ఫోన్లకే వస్తాయని అంతేకాకుండా, గిగ్ వర్కర్ల సౌకర్యార్థం వైపై సౌకర్యంతో కూడిన ప్రత్యేక విశ్రాంత భవనాలను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు రాహుల్ గాంధీ చెప్పుకొచ్చారు.

రూ.5 లక్షల ప్రమాద బీమా, పింఛన్ వసతి

మరోవైపు గిగ్ వర్కర్లు ప్రమాదాల బారిన పడినప్పుడైనా, తీవ్ర అనారోగ్యం పాలైనప్పుడైనా ఆర్థికంగా కోలుకోలేనంతగా నష్టపోతారని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఈ సమస్యకు చెక్ పెట్టేలా ఈ చట్టం ద్వారా ప్రభుత్వం రూ. 5 లక్షల ప్రమాద బీమాను అందిస్తోందని వెల్లడించారు.అంతేకాదు గిగ్ వర్కర్లకు పింఛన్, సామాజిక భద్రత, పొదుపు కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు రాహుల్ గాంధీ వెల్లడించారు.

గిగ్ వర్కర్లను దేశ నిర్మాణంలో భాగస్వాములుగా చేస్తాం

దేశంలో రెండు భిన్నమైన ఆలోచనా విధానాలు ఉన్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ విధానం కార్మికులతో నిరంతరం పనిచేయించుకుంటూ వారి శ్రమను దోచుకునే విధంగా ఉందని విమర్శించారు. కాంగ్రెస్ ఆలోచనా విధానం మాత్రం గిగ్ వర్కర్లను దేశ నిర్మాణంలో భాగస్వాములుగా గుర్తించి, వారికి రక్షణ కల్పించడమేనని చెప్పుకొచ్చారు. ప్రతి డెలివరీలో కార్మికులకు వాటా రావాలని, వారికి విశ్రాంతి, భద్రత కల్పించాలని కాంగ్రెస్ కోరుకుంటోందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ విధానం గిగ్ వర్కర్లకు ప్రయోజనాలు అందకుండా చేస్తోందని ధ్వజమెత్తారు. గిగ్ వర్కర్లు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని, కాంగ్రెస్ పార్టీ వారికి అండగా ఉంటుందని పేర్కొంటూ జై హింద్, జై తెలంగాణ అంటూ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తన ప్రసంగాన్ని ముగించారు.

రేవంత్ రెడ్డి నిరంకుశ వైఖరికి ఇది నిదర్శనం

అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందంటూ రాహుల్ గాంధీ పర్యటనకు వ్యతిరేకంగా శాంతియుత నిరసన చేపట్టేందుకు సిద్ధమైన నేపథ్యంలో గృహనిర్బంధం చేసినట్లు పోలీస్ శాఖ పేర్కొంది.కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్నది భారత్ సమ్మిట్ కాదని అది యాంటీ భారత్ సమ్మిట్ అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు విమర్శించారు.

రేవంత్ రెడ్డి తీరుపై విమర్శల దాడి

బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు హౌస్ అరెస్ట్‌పై కమలం పార్టీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును అడ్డుకోవడం అన్యాయమంటూ మండిపడుతున్నారు.

శాంతి యుత నిరసనలకు భయపడి రాష్ట్ర అధ్యక్షుడిని గృహ నిర్బంధం చేయడం సీఎం రేవంత్ రెడ్డి నిరంకుశ వైఖరికి నిదర్శనం అని బీజేపీ నేతలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.కక్ష సాధింపు చర్యల్లో భాగంగా పోలీసులను అడ్డంపెట్టుకుని ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారు అని మండిపడ్డారు. తక్షణమే రాంచందర్ రావుపై విధించిన హౌస్ అరెస్ట్‌ను ఎత్తివేయాలని, అలాగే రాష్ట్రవ్యాప్తంగా అక్రమంగా నిర్బంధించిన బీజేపీ, బీజేవైఎం కార్యకర్తలను బేషరతుగా విడుదల చేయాలని బీజేపీ నేతలు డిమాండ్ చేసారు.

హౌస్ అరెస్టులు తక్షణమే ఎత్తివేయాలి

మరోవైపు తెలంగాణ ప్రజల పన్నుల సొమ్మును వృథా చేస్తూ, రాజకీయంగా విఫలమైన రాహుల్ గాంధీని తిరిగి రాజకీయంగా నిలబెట్టేందుకు, దేశ వ్యతిరేక శక్తులకు వేదిక కల్పించేందుకు ఈ సదస్సు నిర్వహిస్తున్నారని బీజేపీ ఆరోపించింది. దేశానికి ప్రజాస్వామ్యం, రాజ్యాంగం గురించి బోధించే కాంగ్రెస్ పార్టీ, తెలంగాణలో ప్రతిపక్ష నాయకులను హౌస్ అరెస్ట్ చేయడం ద్వారా రాజ్యాంగ స్ఫూర్తిని కాలరాస్తోందని తెలియదా అని బీజేపీ ప్రశ్నిస్తోంది. ఆరు గ్యారంటీల అమలులో విఫలమైన ప్రభుత్వానికి ప్రజల నిరసనలను అడ్డుకునే నైతిక హక్కు లేదని మండిపడింది. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రాంచందర్‌రావుపై విధించిన హౌస్ అరెస్ట్‌ను తక్షణమే ఎత్తివేయాలని, రాష్ట్రవ్యాప్తంగా నిర్బంధించిన బీజేపీ, బీజేవైఎం కార్యకర్తలను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేసింది.

ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్‌కు చెక్

ఫ్రీ లెఫ్ట్ మార్గాల ఏర్పాటు, లేన్ మార్కింగ్, ట్రాఫిక్ సిగ్నళ్లు, సూచిక బోర్డులు, రోడ్ల విస్తరణ వంటి పనులు చేపట్టనున్నారు. కమిషనర్ జి.సృజన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించడంతో ఇంజినీరింగ్ విభాగం కార్యాచరణ ప్రారంభించింది. తొలి విడత పనులను ఆరు నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.ఐటీ కారిడార్‌లో రహదారుల విస్తరణ, ఫ్లైఓవర్ల నిర్మాణం జరిగినప్పటికీ కొన్ని ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ సమస్య తగ్గడం లేదు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోతున్నాయి. ఈ పరిస్థితిని మార్చేందుకు ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకుంటూ కూడళ్ల రూపకల్పనలో మార్పులు తీసుకురావాలని సీఎంసీ నిర్ణయించింది. వాహనాలు ఒకదానికొకటి అడ్డుపడకుండా ప్రత్యేక లేన్లు, ఫ్రీ లెఫ్ట్ మార్గాలు ఏర్పాటు చేయడంతోపాటు కూడళ్ల వద్ద బస్సులు, ఆటోలు నిలిపి ప్రయాణికులను ఎక్కించుకోవడాన్ని నియంత్రించనున్నారు.గచ్చిబౌలి చౌరస్తా అభివృద్ధిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. నగరంలోనే అత్యంత రద్దీగా ఉండే కూడళ్లలో ఇది ఒకటి. రోడ్ల విస్తరణ, పైవంతెనల నిర్మాణం జరిగినా ఇక్కడ ట్రాఫిక్ ఇబ్బందులు కొనసాగుతున్నాయి. దీంతో కూడలిని శాస్త్రీయంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. అన్ని వైపులా ప్రధాన రహదారులను డివైడర్లతో వేరు చేయడంతోపాటు ఫ్రీ లెఫ్ట్ మార్గాలను అభివృద్ధి చేయనున్నారు. వాహనదారులకు దిశానిర్దేశం చేసే సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తారు. కూడళ్ల వద్ద బస్సులు, ఆటోలు ఆగకుండా చర్యలు తీసుకోనున్నారు. ప్రస్తుతం ఈ పనులు టెండర్ల దశలో ఉన్నాయి.గచ్చిబౌలి, ఖాజాగూడ, మైండ్‌స్పేస్ కూడళ్ల మధ్య ఉన్న బయోడైవర్సిటీ జంక్షన్‌ను కూడా పునరుద్ధరించనున్నారు. ప్రస్తుతం ఉన్న కూడలిని ఎ ఆకారంలో అభివృద్ధి చేసి ఫ్రీ లెఫ్ట్ మార్గాలు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రణాళిక సిద్ధం చేశారు. వర్షాకాలంలో కూడలి వద్ద వరదనీరు నిలవకుండా ప్రత్యేక చర్యలు కూడా చేపట్టనున్నారు. మరోవైపు జాతీయ రహదారి-65పై ఉన్న బీహెచ్ఈఎల్ కూడలిలో ఫ్లైఓవర్ ఉన్నప్పటికీ వాహనాల రద్దీ కొనసాగుతోంది. ఇక్కడ వేర్వేరు మార్గాలకు వాహనాలు సులభంగా వెళ్లేలా సూచిక బోర్డులు, లేన్ మార్కింగ్, డివైడర్లు ఏర్పాటు చేయనున్నారు.తొలి విడతలోని మిగిలిన కూడళ్ల అభివృద్ధి పనులు కూడా వివిధ దశల్లో ఉన్నాయి. కుత్బుల్లాపూర్, జేఎన్‌టీయూ, సర్సాపూర్ చౌరస్తాల పనులకు సంబంధించిన ప్రక్రియ టెండర్ల దశలో ఉండగా కోకాపేట్, నల్లగండ్ల కూడళ్లలో పనులు కొనసాగుతున్నాయి. మొదటి విడతలోని ఎనిమిది కూడళ్ల పనులు పూర్తయ్యేలోపు రెండో విడతలో చేపట్టాల్సిన కూడళ్లకు డిజైన్లు సిద్ధం చేసి టెండర్లు పిలవాలని అధికారులు భావిస్తున్నారు. మొత్తంగా సైబరాబాద్ పరిధిలోని 72 ప్రధాన కూడళ్లను దశలవారీగా అభివృద్ధి చేసి ట్రాఫిక్ సమస్యలను తగ్గించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రణాళిక అమలైతే ఐటీ ఉద్యోగులు, స్థానిక నివాసితులు, ఇతర వాహనదారులకు ప్రయాణ సమయం తగ్గడంతోపాటు రహదారులపై రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి.

రాజకీయాల్లో పోటీ.. అభివృద్ధిలో సహకారం

బెంగళూర్ (ప్రశ్న న్యూస్) రాజకీయ ప్రత్యర్థులుగా ఉన్నప్పటికీ అభివృద్ధి పనుల విషయంలో కేంద్రంతో కలిసి పనిచేస్తామని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో తనకు సత్సంబంధాలు ఉన్నాయంటూ జరుగుతున్న చర్చలపై స్పందిస్తూ రాజకీయాలను, అభివృద్ధిని వేర్వేరుగా చూడాలని వ్యాఖ్యానించారు. "రాజకీయాల్లో పోటీ పడతాం అభివృద్ధిలో సహకరించుకుంటాం" అని పేర్కొన్నారు. బెంగళూరులో శుక్రవారం పింక్‌లైన్ మెట్రో ప్రారంభోత్సవం సహా పలు కార్యక్రమాల్లో మోదీతో శివకుమార్ సరదాగా మాట్లాడటం, సన్నిహితంగా మెలగడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. దీనిపై శనివారం మీడియ

డ్రగ్స్‌కు దూరంగా ఉండండి

- సైక్లింగ్‌తో ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించండి - బండారు దత్తాత్రేయ

- కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు 3,700 కి.మీ. సైక్లింగ్ యాత్రకు శ్రీకారం

హైదరాబాద్, మాదకద్రవ్యాల నిర్మూలనపై యువతలో అవగాహన కల్పించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించేందుకు చేపడుతున్న సైక్లింగ్ యాత్ర అభినందనీయమని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ ప్రతి ఒక్కరూ సైక్లింగ్‌ను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు 'సే నో టు డ్రగ్స్' నినాదంతో 3,700 కిలోమీటర్ల సైక్లింగ్ యాత్ర చేపడుతున్న హైదరాబాద్ సైక్లిస్ట్స్ గ్రూప్ (హెచ్‌సీజీ) సభ్యులను శనివారం హైదరాబాద్‌లోని రాంనగర్‌లో అలై బలై ఫౌండేషన్ ఘనంగా సత్కరించింది. ఫౌండేషన్ అధ్యక్షురాలు బండారు విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బండారు దత్తాత్రేయ ముఖ్య అతిథిగా పాల్గొని సైక్లిస్టులను సన్మానించారు. అనంతరం యాత్రకు జెండా ఊపి శుభారంభం చేశారు. ఈ బృందంలో ఒక మహిళా సైక్లిస్ట్ ఉండటం విశేషం.ఈ నెల 19న శ్రీనగర్‌లో ప్రారంభమయ్యే యాత్ర రాంబన్, పఠాన్‌కోట్, జలంధర్, అంబాలా, ఢిల్లీ, మథుర, గ్వాలియర్, ఝాన్సీ, నాగ్‌పూర్, ఆదిలాబాద్, నిజామాబాద్, హైదరాబాద్, కర్నూలు, అనంతపురం, బెంగళూరు, మదురై తదితర ప్రాంతాల మీదుగా కన్యాకుమారికి చేరుకోనుంది. మొత్తం 3,700 కిలోమీటర్ల దూరాన్ని 21 రోజుల్లో పూర్తి చేయాలని సైక్లిస్టులు లక్ష్యంగా పెట్టుకున్నారు.ఈ యాత్రలో పాల్గొంటున్న గడ్డం మల్లేష్ (ఈగిల్ ఫోర్స్ పోలీస్ ఇన్‌స్పెక్టర్), సెల్వి (ఆర్మీ పాఠశాల ఉపాధ్యాయురాలు), ఉమా మహేశ్వర్ రావు, శ్రీధర్ జిన్నా, శ్రీనివాస్ గౌడ్, డాక్టర్ శ్రీకాంత్, రఘురామ్ సూరి (తెలంగాణ హైకోర్టు న్యాయవాది)లను దత్తాత్రేయ సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైక్లింగ్ వల్ల శారీరక ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా అనేక అనారోగ్య సమస్యలను నివారించవచ్చని తెలిపారు. యువతలో సానుకూల ఆలోచనలు పెంపొందించేందుకు, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. నషా ముక్త్ భారత్, నషా ముక్త్ తెలంగాణ స్ఫూర్తితో డ్రగ్స్‌కు దూరంగా ఉండండి.. ఆరోగ్యకరమైన జీవితాన్ని అలవర్చుకోండి అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్న సైక్లిస్టులకు అభినందనలు తెలిపారు. వారి యాత్ర విజయవంతంగా, సురక్షితంగా సాగాలని ఆకాంక్షించారు.

ఆలయాల్లో కనీస వసతులు కల్పించడంలో
ప్రభుత్వం విఫలం

- భాగ్యనగర ఉత్సవ సమితి కార్యదర్శి పల్లపు గోవర్ధన్

హైదరాబాద్ హిందు ఆలయాల్లో కనీస వసతులు కల్పించడంలో ప్రభుత్వం రోజురోజుకు విఫలం చెందుతుందని భాగ్యనగర ఉత్సవ సమితి కార్యదర్శి, ఖైరతాబాద్ నియోజకవర్గ సీనియర్ నేత పల్లపు గోవర్ధన్ విమర్శించారు. ఫిలింనగర్ లోని పర్వతాంజనేయ స్వామి ఆలయంలో ఆయన పిలుపునిచ్చిన శ్రమదానం కార్యక్రమానికి స్థానికులు పెద్ద సంఖ్యలో స్పందించారు. సుమారు 500 మంది కార్యకర్తలతో కలిసి ఆయన ఆలయంతో పాటు ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాము ఆలయంలో శ్రమదానం చేస్తామని పిలుపునివ్వడంతో హుటాహుటిన జిహెచ్ఎంసి అధికారులు స్పందించి పారిశుధ్య సిబ్బందిని ఇక్కడికి పంపించారని, అంటే ఎవరైనా ప్రశ్నిస్తేనే స్పందిస్తారా అంటూ ఆయన ఎద్దేవా చేశారు. ప్రతినెల ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ఏదో ఒక దేవాలయంలో హిందూ బంధువులందరితో కలిసి శ్రమదానం కార్యక్రమాలు కొనసాగిస్తామని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. ఫిలింనగర్ లోని పర్వతాంజ నే ఓయ స్వామి ఆలయానికి వెంటనే ప్రహరీ నిర్మించాలని ఆలయ స్థలాన్ని కాపాడాలని ఆయన కోరారు.

ముదిరాజులకు ఇచ్చిన
హామీలు నెరవేర్చండి

-తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ డిమాండ్

హైదరాబాద్ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడానికి ముదిరాజ్ సామాజిక వర్గం ముఖ్య పాత్ర పోషించిందని వారికి ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం తాచ్చరం చేయడం ఎంత మాత్రం సబబు కాదని తెలంగాణ మన ముదిరాజ్ సభ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ మేరకు సోమాజిగూడ,ప్రెస్ క్లబ్ లో సత్తయ్య ముదిరాజ్, పండుగ బాలు ముదిరాజ్, ఎర్రబోయిన ఉష,నీలం శ్వేత బాలు,తదితర ముదిరాజ్ నాయకులు పాల్గొని మాట్లాడారు.తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ ఆవిర్భవించి 12 సంవత్సరాలు గడుస్తున్నందున 21వ తేదీన తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ముదిరాజులందరూ ముదిరాజ్ జెండా ఎగరవేసి ఐక్యత చాటాలని అన్నారు. ఇప్పటికే మన ముదిరాజ్ మహాసభ అనేక పోరాటాలు చేసి విజయాలు దక్కించుకుందని అన్నారు. రాబోవు రోజులలో ప్రభుత్వం ముదిరాజుల కు ఇచ్చిన హామీలను నెరవేర్చుకుంటే ముదిరాజ్ డిమాండ్లు అయినా అనేక అంశాలను ప్రజాక్షేత్రంలో ఉంచి పోరాటం చేస్తామని హెచ్చరించారు.

జనసేన తెలంగాణ వీరమహిళల
ఆత్మీయ సమావేశం ప్రారంభం

- పార్టీ సంస్థాగత విస్తరణలో మహిళల భాగస్వామ్యంపై ముఖాముఖి చర్చ

హైదరాబాద్:జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర వీరమహిళల ఆత్మీయ సమావేశం మాదాపూర్‌లోని జూబ్లీ రిడ్జ్ వేదికగా ప్రారంభమైంది. జనసేన పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ డా. గడల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి, తెలంగాణ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ నేమూరి శంకర్ గౌడ్, ప్రచార కార్యదర్శి ఆర్.కె. సాగర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి పలువురు వీరమహిళలు సమావేశానికి తరలివచ్చారు.పార్టీ సంస్థాగత విస్తరణలో వీరమహిళల పాత్ర, నాయకత్వ బాధ్యతల్లో మహిళలకు ప్రాధాన్యం, పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై సమావేశంలో ముఖాముఖి చర్చిస్తున్నారు. వీరమహిళల అభిప్రాయాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని పార్టీ రాష్ట్ర నాయకత్వం భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయాలు తీసుకోనుంది. పార్టీ కార్యక్రమాల్లో మహిళల భాగస్వామ్యాన్ని మరింత పెంచేలా దిశానిర్దేశం చేయనున్నారు.

బ్రహ్మోత్సవాలకు కేటీఆర్‌కు ఆహ్వానం

- ఆహ్వాన పత్రిక అందజేసిన ఆలయ కమిటీ సభ్యులు



ఎల్లారెడ్డిపేట : రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఆహ్వానం అందింది. ఈ నెల 19 నుంచి 24 వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని కోరుతూ ఆలయ కమిటీ సభ్యులు శనివారం హైదరాబాద్‌లో కేటీఆర్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఆలయ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

50 రకాల క్యాన్సర్‌లను ముందుగానే
గుర్తించే కొత్త రకమైన పరీక్ష

- క్యాన్సర్‌ను ఎలా గుర్తిస్తుంది..?



క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించేందుకు ఒకే రక్త నమూనాతో 50కి పైగా రకాల క్యాన్సర్లను గుర్తించగలుగుతామని చెబుతున్న గల్లెరి పరీక్షపై ఆసక్తి పెరుగుతోంది. ఈ పరీక్షను అభివృద్ధి చేసిన సంస్థ వాదనల ప్రకారం.. లక్షణాలు కనిపించకముందే క్యాన్సర్‌కు సంబంధించిన సంకేతాలను గుర్తించవచ్చు. అయితే పరిశోధనల్లో ఈ పరీక్షకు కొన్ని పరిమితులు ఉన్నట్లు వెల్లడైంది. ముఖ్యంగా ప్రారంభ దశ క్యాన్సర్లను గుర్తించడంలో ఇది అంత సమర్థవంతంగా లేదని, క్యాన్సర్ మరణాల ప్రమాదాన్ని తగ్గిస్తుందని ఇప్పటివరకు నిరూపితం కాలేదని నిపుణులు చెబుతున్నారు. అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ సలహా మండలి గత సెప్టెంబర్ 23న ఈ పరీక్షకు అనుమతి ఇవ్వాలని సిఫారసు చేసింది. అయితే ఇది తుది అనుమతి కాదు. పరీక్షకు సంబంధించిన వివరాల్లో ప్రారంభ దశ క్యాన్సర్ గుర్తింపు అనే పదాన్ని తొలగించాలని కూడా మండలి సభ్యులు సూచించారు.

గల్లెరి పరీక్ష అంటే ఏమిటి..?:

గల్లెరి పరీక్ష రక్తంలోని క్యాన్సర్ కణాల నుంచి విడుదలయ్యే డీఎన్ఏ ముక్కలను పరిశీలిస్తుంది. వాటిపై ఉండే ప్రత్యేకమైన మిథైలేషన్ గుర్తులను గుర్తించి, యంత్ర అభ్యాస పద్ధతుల ద్వారా క్యాన్సర్ సంకేతాలు ఉన్నాయా లేదా అని ఫలితం ఇస్తుంది. 50కి పైగా క్యాన్సర్లను గుర్తించే అవకాశం, క్యాన్సర్ ఏ అవయవం నుంచి మొదలై ఉంటుందో అంచనా వేయగలగడం దీని ప్రత్యేకతలు. ఒక అధ్యయనంలో పరీక్ష చేయించుకున్న 32 వేల మందిలో 173 మందికి క్యాన్సర్ నిర్ధారణ కాగా, వారిలో 91 శాతం మందికి క్యాన్సర్ రకాన్ని ఈ పరీక్ష సరిగ్గా అంచనా వేసింది. తప్పుడు పాజిటివ్ ఫలితాలు కూడా సుమారు 0.5 శాతమేనని పరిశోధకులు తెలిపారు. అయితే మూడు సంవత్సరాల పాటు పరీక్షించినప్పుడు అన్ని దశల్లోని క్యాన్సర్లను గుర్తించే సామర్థ్యం 31 శాతం కంటే తక్కువగా ఉంది. అంటే దాదాపు 69 శాతం కేసులను గుర్తించలేకపోయింది. ప్రారంభ దశ క్యాన్సర్లను గుర్తించే సామర్థ్యం కేవలం 21 శాతమే. అంటే దాదాపు 80 శాతం కేసులు తప్పిపోయాయి. సభ్యుల మధ్య భిన్నాభిప్రాయాలు..: ఈ పరీక్ష వల్ల క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించి మరణాల ప్రమాదాన్ని తగ్గించవచ్చని ఆశించినప్పటికీ, ఇప్పటివరకు అలాంటి ప్రయోజనం నిరూపితం కాలేదు. మూడు సంవత్సరాల్లో ముదిరిన దశ క్యాన్సర్ల సంఖ్యను తగ్గించాలన్న పరిశోధన లక్ష్యాన్ని కూడా ఈ పరీక్ష చేరుకోలేకపోయింది. అమెరికా సలహా మండలి పరీక్ష సురక్షితమని ఏకగ్రీవంగా సిఫారసు చేసినప్పటికీ, దాని ప్రభావంపై మాత్రం సభ్యుల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. పాజిటివ్ ఫలితం వస్తే మరిన్ని పరీక్షలు, కొన్నిసార్లు బయాప్సీ చేయాల్సి వస్తుంది. ఒక అధ్యయనంలో 0.6 శాతం మందికి ఇన్వేసివ్ పరీక్షలు అవసరమయ్యాయి. పరీక్ష వల్ల కలిగే ప్రయోజనాలు, ప్రమాదాలపై ఇంకా స్పష్టత అవసరమని నిపుణులు అభిప్రాయపడ్డారు.

వైద్యులతో చర్చించాలి..:

ఈ పరీక్ష చేయించుకోవాలా వద్దా అనే విషయాన్ని వైద్యుడితో చర్చించిన తర్వాతే నిర్ణయించుకోవాలి. అమెరికాలో ప్రస్తుతం దీని ధర 949 డాలర్లు కాగా, ప్రభుత్వ ఆరోగ్య బీమా లేదా ఇతర బీమా సంస్థలు ఖర్చును భరిస్తాయనే హామీ లేదు. తప్పుడు నెగెటివ్ ఫలితం వచ్చిందని క్యాన్సర్ లేదని పూర్తిగా నమ్మకూడదు. ముఖ్యంగా పెద్దపేగు, రొమ్ము, గర్భాశయ ముఖద్వారం, ఊపిరితిత్తుల క్యాన్సర్ల కోసం ప్రస్తుతం సిఫారసు చేస్తున్న పరీక్షలను మాత్రం నిర్లక్ష్యం చేయకూడదు. ఇవి ప్రారంభ దశలో క్యాన్సర్‌ను గుర్తించడమే కాకుండా, క్యాన్సర్ వల్ల మరణించే ప్రమాదాన్ని తగ్గిస్తాయని నిరూపితమైంది. కొత్త పరీక్షలపై ఆశలు పెట్టుకున్నప్పటికీ, నిరూపితమైన క్యాన్సర్ పరీక్షలను క్రమం తప్పకుండా చేయించుకోవడమే ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు.

రాహుల్ గాంధీ నా స్కూటీ ఎక్కడం
మర్చిపోలేని అనుభూతి

- మహిళా గిగ్ వర్కర్ ఫుల్ ఖుషి

హైదరాబాద్: నగరంలో గిగ్ వర్కర్లు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ ప్రతిపక్ష నేత, సీనియర్ లీడర్ రాహుల్ గాంధీ, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. రాహుల్ గాంధీ ఓ అమ్మాయి స్కూటీపై ప్రయాణించారు. హైటెక్స్ ముందున్న ఇందిరాగాంధీ విగ్రహం నుంచి జయభేరి గ్రౌండ్ వరకు ర్యాలీ సాగింది. ఈ ర్యాలీలో తన స్కూటీపై రాహుల్ గాంధీ ప్రయాణించడం పట్ల గిగ్ వర్కర్ లలిత ఫుల్ ఖుషి అయ్యారు. "నేను ఈరోజు గిగ్ వర్కర్స్ ర్యాలీ ఉందని తెలుసుకుని ఇక్కడకు వచ్చా. నేను స్కూటీపై కూర్చున్న సమయంలో ఒకరు వచ్చి రాహుల్ గాంధీ మీ బైక్ ఎక్కుతారు అని చెప్పారు. రాహుల్ గాంధీని నా స్కూటీ మీద ఎక్కించుకుని డ్రైవ్ చేయడం మర్చిపోలేనిది. ఆయన నాతో చాలా బాగా మాట్లాడారు. అమ్మాయిల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గిగ్ వర్కర్ల కోసం చేస్తున్న కార్యక్రమాలు బాగున్నాయి. నేను హాస్టల్‌లో ఉంటూ రాపిడో డ్రైవ్ చేస్తూ అదనపు ఆదాయం పొందుతున్నా. మాది కర్నూలు జిల్లా.. మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చాను. మహిళలకు ఇంకా భద్రత కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి." అని లలిత తన అనుభవాలను పంచుకున్నారు. ఇక ఈ ర్యాలీ అనంతరం రాహుల్ గాంధీ జయభేరి గ్రౌండ్‌లోని ఏర్పాటు చేసిన బహిరంగ సభకు హాజరయ్యారు.

చిలకలూరిపేటలో డిస్టిక్ సివిల్ సప్లై
అధికారుల తనిఖీలు

- నాణ్యత లేని బియ్యంపైస్పందించిన అధికారులు!

చిలకలూరిపేట:పట్టణంలోని రైతు బజార్ వద్ద ఉన్న రేషన్ దుకాణంలో పేద ప్రజలకు పంపిణీ చేస్తున్న బియ్యాన్ని జిల్లా సివిల్ సప్లై అధికారులుఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా స్థానిక ప్రజలు అధికారుల ఎదుట తమ గోడును వెళ్లబోసుకున్నారు.పంపిణీ చేస్తున్న బియ్యం అస్సలు బాగోలేదని, బియ్యంలో పురుగులువస్తున్నాయని,అలాగే అన్నం వండినప్పుడు ముద్దలా మారుతోందని పట్టణ ప్రజలు అధికారులకు తెలిపారు.ప్రజల సమస్యలపై జిల్లా సివిల్ సప్లై అధికారి సానుకూలంగా స్పందించారు.గతంలో రేషన్ బియ్యం వెనక్కి (రిటర్న్) తీసుకునే నిబంధన లేనప్పటికీ... ప్రస్తుతం ప్రజల అభిప్రాయం, వారి విజ్ఞప్తి మేరకు నాణ్యత లేని బియ్యాన్ని తిరిగి తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.

శ్రీకాళహస్తి ఆలయంలో
స్పై కెమెరా కళ్లజోడు కలకలం

- భక్తుడిని అదుపులోకి తీసుకున్న ఎస్పీఎఫ్

- రహస్య కెమెరా ఉన్న కళ్లజోడుతో ఆలయంలోకి ప్రవేశించిన పూణె వ్యక్తి

- కెమెరా కళ్లజోడు ధరించిన భక్తుడిని గుర్తించిన అర్చకులు

- గర్భాలయ దృశ్యాలు చిత్రీకరించారా అనే కోణంలో అధికారుల విచారణ



శ్రీకాళహస్తి : ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తి ఆలయంలో స్పై కెమెరా కళ్లజోడు కలకలం రేపింది. ఆలయ నిబంధనలను ఉల్లంఘించి కెమెరా అమర్చిన కళ్లద్దాలతో లోపలికి ప్రవేశించిన ఓ భక్తుడిని భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. మహారాష్ట్రలోని పూణెకు చెందిన అంకేష్ అగర్వాల్ అనే భక్తుడు తన కుటుంబ సభ్యులతో కలిసి శ్రీకాళహస్తీశ్వర ఆలయ దర్శనానికి వచ్చారు. మొదట ఆయన ఆలయంలో రూ. 5,000 రుసుము చెల్లించి రాహు-కేతు నివారణ పూజ నిర్వహించారు. ఆ పూజ పూర్తయిన తర్వాత కుటుంబ సమేతంగా ప్రధాన ఆలయంలో స్వామి, అమ్మవార్ల దర్శనానికి వెళ్లారు. అమ్మవారి సన్నిధిలో దర్శనం చేసుకుంటుండగా, ఆయన కళ్లకు ఉన్న అద్దాలలో రహస్య కెమెరా (స్పై కెమెరా) అమర్చి ఉండటాన్ని అక్కడి అర్చకులు గుర్తించారు. విషయాన్ని గ్రహించిన అర్చకులు వెంటనే ఆలయ విధుల్లో ఉన్న స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్పీఎఫ్) సిబ్బందికి సమాచారం అందించారు. స్పందించిన భద్రతా సిబ్బంది సదరు భక్తుడిని అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభించారు. శ్రీకాళహస్తి ఆలయ ప్రాంగణంలోకి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావడం, ముఖ్యంగా గర్భాలయం పరిసరాల్లో ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ చేయటంపై కఠిన నిషేధం అమల్లో ఉంది. అలాంటిది తనిఖీలను దాటుకుని స్పై కెమెరా కళ్లజోడుతో ఆలయంలోకి ఎలా రాగలిగారనే దానిపై అధికారులు ఆరా తీస్తున్నారు. ఆలయ అంతరాలయంలోని సున్నితమైన దృశ్యాలను ఏమైనా రికార్డ్ చేశారా అనే కోణంలో పోలీసులు, ఎస్పీఎఫ్ సిబ్బంది దర్యాప్తు చేస్తున్నారు.

అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో
ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

- ఘనంగా పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి ఉత్సవాలు



కరీంనగర్:కరీంనగర్‌లోని అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి, జాతీయ బాలల దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ నెక్ట్స్, అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్ నెక్ట్స్, అల్ఫోర్స్ టైనీ టాట్స్, అల్ఫోర్స్ గర్ల్స్ ఇ-టెక్నో పాఠశాలలతో పాటు మంకమ్మతోటలోని అల్ఫోర్స్ ప్లానెట్ కిడ్స్, కిసాన్ నగర్‌లోని అల్ఫోర్స్ విద్యాభారతి హైస్కూల్, భగత్‌నగర్‌లోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాల, విద్యారణ్యపురిలోని అల్ఫోర్స్ కిడ్స్ జి పాఠశాలల్లో ఈ వేడుకలు సందడిగా జరిగాయి.ఈ కార్యక్రమాలకు అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత, వీఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ వి. నరేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై, విద్యార్థుల ఉత్సాహభరిత కేరింతల మధ్య వేడుకలను ప్రారంభించారు. తొలుత పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, భారతదేశ తొలి ప్రధానమంత్రిగా పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ దేశ అభివృద్ధికి విశేష కృషి చేశారని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం అనంతరం విజ్ఞాన, శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధికి, పంచవర్ష ప్రణాళికల అమలుకు బలమైన పునాదులు వేశారని కొనియాడారు. నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని విశ్వసించిన నెహ్రూకు చిన్నారులంటే ఎంతో ప్రేమాభిమానాలు ఉండేవని, అందుకే పిల్లలంతా ఆయనను ఆప్యాయంగా 'చాచా నెహ్రూ' అని పిలుచుకునేవారని గుర్తుచేశారు.నెహ్రూ జయంతిని జాతీయ బాలల దినోత్సవంగా జరుపుకోవడం గర్వకారణమని, ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, ఆరోగ్యకరమైన వాతావరణం, భయం లేని బాల్యాన్ని అందించినప్పుడే ఆయన ఆశయాలకు నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని అన్నారు.దేశంలో సాంకేతిక, వైద్య, నిర్వహణ విద్యను బలోపేతం చేయడంలో ఐఐటీలు, ఐఐఎంలు, ఎయిమ్స్ వంటి ఉన్నత విద్యా సంస్థల అభివృద్ధికి నెహ్రూ హయాంలో ప్రాధాన్యత లభించిందని పేర్కొన్నారు. అలాగే భిన్నత్వంలో ఏకత్వం అనే భావనకు అనుగుణంగా అన్ని మతాలు, కులాల ప్రజలకు సమాన హక్కులు కల్పించే లౌకిక విలువలను బలోపేతం చేశారని వివరించారు.చిన్నారుల్లో పఠనాసక్తి, సృజనాత్మకతను పెంపొందించేందుకు నేషనల్ బుక్ ట్రస్ట్, చిల్డ్రన్స్ ఫిల్మ్ సొసైటీ వంటి సంస్థల ఏర్పాటుకు కూడా ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. బాలల సమగ్ర అభివృద్ధికి విద్యతో పాటు పోషకాహారం, ఆరోగ్యం, సృజనాత్మకత ఎంతో అవసరమని సూచించారు.వేడుకల్లో భాగంగా పలువురు విద్యార్థులు చాచా నెహ్రూ వేషధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చిన్నారులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు అందరినీ అలరించాయి. పాఠశాలల ప్రాంగణాలు విద్యార్థుల సందడి, ఉత్సాహంతో పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి.ఈ కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కారులో మంటలు
వ్యక్తి సజీవ దహనం

నిర్మల్ జిల్లా సోపీనగర్‌లో శనివారం వేగంగా వచ్చిన కారు డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో ఒక్కసారిగా కారులో మంటలు చెలరేగాయి. ప్రమాదం జరిగిన వెంటనే కారు మంటల్లో చిక్కుకుంది. అందులో ఉన్న ఓ వ్యక్తి బయటకు వచ్చేలోపే సజీవ దహనమయ్యాడు. కారులో భారీగా మంటలు వ్యాపించడంతో వ్యక్తిని రక్షించలేకపోయామని స్థానికులు వెల్లడించారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మితిమీరిన వేగమే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని భావిస్తున్నారు.

క్యూ2లో వియాష్

సైంటిఫిక్ జోరు

రూ. 84 కోట్లకు చేరిన లాభం

- మొత్తం ఆదాయం రూ. 999.7 కోట్లుగా నమోదు
- గతేడాదితో పోలిస్తే ఆదాయం, లాభాల్లో రెండంకెల వృద్ధి
- ఫార్ములేషన్స్, ఏపీఐ విభాగాల్లో అమ్మకాలు పెరగడమే కారణం
- ఇటలీ కంపెనీ బయోఫర్‌లైఫ్ కొనుగోలు ప్రక్రియ పూర్తి



ఫార్మా రంగ సంస్థ వియాష్ సైంటిఫిక్ లిమిటెడ్ (గతంలో సీక్వెంట్ సైంటిఫిక్) 2026-27 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో బలమైన ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. ఈ త్రైమాసికంలో కంపెనీ ఏకీకృత నికర లాభం రూ. 84.65 కోట్లుగా నమోదు కాగా, మొత్తం ఆదాయం రూ. 999.7 కోట్లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరం (2025-26) ఇదే త్రైమాసికంతో పోలిస్తే కంపెనీ పనితీరు గణనీయంగా మెరుగుపడింది. గతేడాది ఇదే కాలంలో కంపెనీ ఆదాయం రూ. 857.76 కోట్లు, నికర లాభం రూ. 72.90 కోట్లుగా ఉన్నాయి. కార్యకలాపాల ద్వారా వచ్చిన ఆదాయం రూ. 850.30 కోట్ల నుంచి 16.2 శాతం పెరిగి రూ. 987.94 కోట్లకు చేరుకుంది. కంపెనీ ఫార్ములేషన్స్, ఏపీఐ (యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రీడియెంట్స్) విభాగాల్లో రెండంకెల స్థాయిలో అమ్మకాల వృద్ధి నమోదు చేయడం ఈ పురోగతికి ప్రధాన కారణంగా నిలిచింది. దీనికి తోడు, కంపెనీ తన అనుబంధ సంస్థ అయిన అలివిరా యానిమల్ హెల్త్ ద్వారా ఇటలీకి చెందిన బయోఫర్‌లైఫ్ కొనుగోలును విజయవంతంగా పూర్తి చేసింది. ఈ ఒప్పందం యూరప్‌లోని యానిమల్ హెల్త్ మార్కెట్‌లో కంపెనీ వ్యాపారాన్ని మరింత బలోపేతం చేస్తుందని భావిస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం తొలి అర్ధ భాగంలోనూ (ఏప్రిల్-సెప్టెంబర్ 2026) వియాష్ సైంటిఫిక్ మంచి పనితీరు కనబరిచింది. ఈ ఆరు నెలల కాలంలో మొత్తం ఆదాయం రూ. 1,954.3 కోట్లకు చేరగా, నికర లాభం 49 శాతం వృద్ధితో రూ. 163.94 కోట్లుగా నమోదైంది. నవంబర్ 13న జరిగిన బోర్డు సమావేశంలో ఈ ఆర్థిక ఫలితాలకు ఆమోదం తెలిపారు. విలీనం తర్వాత కంపెనీ కార్యకలాపాలు స్థిరంగా రాణిస్తున్నాయని ఈ ఫలితాలు సూచిస్తున్నాయి.

ఆన్‌లైన్‌లో అమ్మాయిలే టార్గెట్

యూకేలో భారత విద్యార్థికి 30 ఏళ్ల

- యూకేలో భారత విద్యార్థి బిలాల్ కాజీ కేసులో సంచలన తీర్పు
- ఆన్‌లైన్‌లో అమ్మాయిలను లక్ష్యంగా చేసుకుని లైంగిక వేధింపులు-
- 70 మంది బాధితులను గుర్తించిన పోలీసులు, 180 మందిపై అనుమానం
- 37 అభియోగాల్లో దోషిగా తేలిన విద్యార్థి
- కాజీని 'డేంజరస్ ప్రిడేటర్'గా అభివర్ణించిన కోర్టు

లండన్ యునైటెడ్ కింగ్‌డమ్(యూకే)లో చదువుతున్న భారతీయ విద్యార్థికి చైల్డ్ సెక్సువల్ అబ్యూజ్ కేసులో భారీ శిక్ష పడింది. ఆన్‌లైన్‌లో అమ్మాయిలను లక్ష్యంగా చేసుకుని లైంగిక వేధింపులకు పాల్పడినట్లు రుజువుకావడంతో 27 ఏళ్ల బిలాల్ కాజీకి చెస్టర్ క్రౌన్ కోర్టు 30 ఏళ్ల జైలు శిక్ష విధించింది. చెస్టర్, బర్మింగ్‌హామ్ విశ్వవిద్యాలయాల్లో చదువుతున్న బిలాల్ కాజీ, ఆన్‌లైన్ ద్వారా బాలికలను లక్ష్యంగా చేసుకున్నాడు. ఈ కేసులో పోలీసులు ఇప్పటివరకు 70 మంది బాధితులను గుర్తించారు. మరో 180 మంది బాధితులు ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. మొత్తం 37 అభియోగాలను కాజీ కోర్టులో అంగీకరించాడు. ఈ కేసును చెషైర్ పోలీస్ చరిత్రలోనే అతిపెద్ద ఆన్‌లైన్ చైల్డ్ అబ్యూజ్ విచారణగా అధికారులు పేర్కొన్నారు. సుమారు 28 పోలీస్ బృందాలు సమన్వయంతో ఈ కేసును దర్యాప్తు చేశాయి. 2023 జులైలో దేశం విడిచి వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా కాజీని హీత్రూ ఎయిర్‌పోర్టులో అరెస్టు చేశారు. ఈ కేసు విచారణ సందర్భంగా జడ్జి స్టీవెన్ ఎవరెట్, కాజీని 'డేంజరస్ ప్రిడేటర్'గా అభివర్ణించారు. 30 ఏళ్ల జైలు శిక్షతో పాటు, అదనంగా ఎనిమిదేళ్ల ఎక్స్‌టెండెడ్ లైసెన్స్ కాలం కూడా విధించారు. శిక్షాకాలంలో కనీసం మూడింట రెండొంతుల సమయం జైలులోనే గడపాలని, జీవితకాలం సెక్స్ అఫెండర్స్ రిజిస్టర్‌లో కొనసాగాలని ఆదేశించారు. ఈ కేసు దర్యాప్తు ఒక 'భారీ దర్యాప్తు' అని బ్రిటిష్ అధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాద స్థలాన్ని పరిశీలించిన

హోం మంత్రి అనిత



అనకాపల్లి ఎస్.రాయవరం మండలం కొత్త పోలవరం వద్ద రోడ్డు ప్రమాద స్థలాన్ని హోం మంత్రి వంగలపూడి అనిత పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును మంత్రికి పోలీసు అధికారులు వివరించారు. ప్రమాదానికి గల కారణాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. తరువాత నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. నక్కపల్లి ఆసుపత్రి వద్ద మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. రోడ్డు ప్రమాదంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

అమెరికాలో గంటలపాటు నిలిచిన

11వేల విమానాలు



న్యూయార్క్ అగ్రరాజ్యం అమెరికాలో విమాన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సాంకేతిక సమస్య కారణంగా దాదాపు 11వేల విమానాలు కొన్ని గంటల పాటు ఎయిర్‌పోర్టుల్లోనే నిలిచిపోయాయి. ఏటీసీ కమ్యూనికేషన్ సమస్య కారణంగా విమాన సేవలను నిలిపివేసినట్లు ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు ప్రకటించారు. ప్రస్తుతం పరిస్థితి మెరుగుపడిందని.. విమాన సర్వీసులను నెమ్మదిగా పునరుద్ధరిస్తున్నట్లు వెల్లడించారు. అమెరికా కాలమానం ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం 4 గంటల (భారత్‌లో శనివారం తెల్లవారుజామున 2.30 గంటల) సమయంలో ఈ అంతరాయం ఏర్పడింది. ప్రాంతీయ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సెంటర్ల వద్ద కమ్యూనికేషన్ వ్యవస్థల్లో సాంకేతిక సమస్య కారణంగా అసాధారణ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో అమెరికా వ్యాప్తంగా విమానాల టేకాఫ్‌లను నిలిపివేయాలని ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు ఆదేశించారు. దీంతో వేలాది విమాన సర్వీసులపై ప్రభావం పడింది. దాదాపు 10వేల విమానాలు ఆలస్యమయ్యాయని, మరో 1000 సర్వీసులు రద్దయ్యాయని ఫ్లైట్ ట్రాకింగ్ సర్వీస్ 'ఫ్లైట్ అవేర్' డేటా వెల్లడించింది. కొన్ని వందల విమానాలను దారిమళ్లించారు. దీంతో దాదాపు 15లక్షల మంది ప్రయాణికులు విమానాశ్రాయాల్లో పడిగాపులు కాశారు.ఓవర్‌లోడ్ వల్లే..: 22 ప్రాంతీయ ఏటీసీ కేంద్రాల్లో కమ్యూనికేషన్ సమస్య తలెత్తింది. కాలం చెల్లిన టెలికమ్యూనికేషనల్ మౌలిక సదుపాయాలు, ఓవర్‌లోడ్ స్విచ్‌లు, రూటర్ల కారణంగా సాంకేతిక వైఫల్యం నెలకొన్నట్లు అమెరికా రవాణా మంత్రి సీన్ డఫీ వెల్లడించారు. అమెరికా ఏటీసీ వ్యవస్థలు చాలా పాతవని, ఇప్పటికీ అనలాగ్ సిస్టమ్స్‌పైనే ఆధారపడినట్లు పేర్కొన్నారు. అందుకే డేటా ఎక్కువగా ఉన్నప్పుడు ఓవర్‌లోడ్ సమస్య తలెత్తుతున్నట్లు తెలిపారు. "ఈ సమస్య కారణంగా మేం రాడార్లు, టెలికమ్యూనికేషన్ సామర్థ్యాలను పూర్తిగా కోల్పోలేదు. అయితే, భద్రతా కారణాలు, ప్రయాణికుల రక్షణ దృష్ట్యా విమానాలను నిలిపివేయాలని నిర్ణయించాం" అని సీన్ డఫీ స్పష్టం చేశారు. ఎఫ్ఏఏ ఆదేశాలు జారీ చేసినప్పుడు దాదాపు 3500 విమానాల్లో గాల్లోనే ఉన్నాయి. అవన్నీ అత్యవసరంగా సమీప ఎయిర్‌పోర్టుల్లో ల్యాండయ్యాయి. సమస్యను పరిష్కరించిన అనంతరం దాదాపు నాలుగు గంటల తర్వాత ఎఫ్ఏఏ తన గ్రౌండ్ ఆర్డర్స్‌ను ఎత్తివేసింది. దీంతో విమాన సర్వీసులను పునరుద్ధరించేందుకు ఎయిర్‌లైన్లకు అనుమతి లభించింది. అయితే, సాధారణ స్థితికి వచ్చేందుకు మరికొంత సమయం పట్టొచ్చని అధికారులు చెబుతున్నారు.

సైబర్ దాడి కాదు: ట్రంప్ఈ పరిణామాలపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. ఇది సైబర్ దాడి లేదా కృత్రిమ మేధ కారణంగా ఏర్పడిన సమస్య కాదని ఆయన తెలిపారు. మైక్రోసాఫ్ట్ సర్వీసులకు అంతరాయం ఏర్పడిన సమయంలోనే విమాన సేవలు నిలిచిపోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, దీనికి తమ సేవలతో ఎలాంటి సంబంధం లేదని టెక్ దిగ్గజం వెల్లడించింది. 2023 జనవరిలోనూ ఈ తరహా సమస్య తలెత్తింది. సాంకేతిక వైఫల్యం కారణంగా నాడు ఎయిర్‌లైన్లకు ఎఫ్ఏఏ అధికారులు నోటమ్ జారీ చేశారు. దీంతో వేలాది విమానాలు ఎయిర్‌పోర్టులకే పరిమితమయ్యాయి. ఇక, 2001 సెప్టెంబరు 11న అగ్రరాజ్యంలో చోటుచేసుకున్న భీకర ఉగ్రదాడి సమయంలోనూ విమానాలను ఇలాగే నిలిపివేశారు. అయితే, ఇది మరో 9/11 కాదని ఏవియేషన్ అధికారులు వెల్లడించారు.

పేద మహిళ ఆవేదనకు

24 గంటల్లో పరిష్కారం

- ఒక్కరోజులోనే రేషన్ కార్డు, బియ్యం అందజేత

- నిజమైన నాయకుడు సేవ చేసినవాడే - షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ పట్టణానికి చెందిన ఒంటరి మహిళ బుర్ర నాగామణి సమస్యపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తక్షణమే స్పందించి ఒక్కరోజులోనే పరిష్కారం చూపించారు. ప్రజలకు కష్టకాలంలో అండగా నిలిచి సేవ చేసినవాడే నిజమైన నాయకుడని ఆయన పేర్కొన్నారు. ఖురాన్, భగవద్గీత, బైబిల్ వంటి పవిత్ర గ్రంథాలన్నీ సాటి మనిషికి సేవ చేయాలనే సందేశాన్ని ఇస్తాయని, పవిత్ర కార్తీక మాసంలో నిరుపేదలకు సహాయం చేయడం ఎంతో ఆత్మతృప్తినిస్తుందని ఎమ్మెల్యే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ఒంటరి మహిళలు, వితంతువులు, గీత కార్మికులు, దివ్యాంగులు, పద్మశాలీలకు ఆసరా పింఛన్లు మంజూరు చేసిందని తెలిపారు.షాద్ నగర్ పట్టణానికి చెందిన 15వ వార్డులోని బుర్ర నాగామణి తన భర్త విడిచిపెట్టి పదేళ్లు గడిచినా ఇన్నాళ్లూ పింఛన్ అందలేదని, ఇటీవల పింఛన్ మంజూరైనా రేషన్ కార్డు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో వెంటనే స్పందించిన వీర్లపల్లి శంకర్ జిల్లా కలెక్టర్, జిల్లా పౌరసరఫరాల అధికారితో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించారు. ఆయన చొరవతో 24 గంటల్లోనే నాగామణికి రేషన్ కార్డు మంజూరైంది. అనంతరం 28వ వార్డులోని రేషన్ దుకాణం ద్వారా బియ్యం కూడా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, స్థానిక కౌన్సిలర్లు, మున్సిపల్ చైర్మన్ పార్టీలకు అతీతంగా పేద ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాలని సూచించారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో పత్రికా ప్రతినిధులు కూడా కీలక పాత్ర పోషించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, బాలరాజు గౌడ్, కౌన్సిలర్లు మురళి మోహన్ అప్పి, సాదత్, పెంటయ్య, దిలీప్, ముబారక్ అలీ ఖాన్, జఖ్రుత్ ఖాన్, మంగ మధు, వెంకట్రాం రెడ్డి, శుక్ర వర్ధన్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్, మహమ్మద్ ఇబ్రహీం, డాక్టర్ బుచ్చయ్య, నందిగామ మండల పార్టీ అధ్యక్షుడు కుమార్ గౌడ్ పాల్గొన్నారు

దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే..

- మాజీ మంత్రి దానం

హైదరాబాద్ నేటి బాలలే రేపటి పౌరులని ఆనాటి దేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ అన్నారని ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా ఆయన రాజ్ భవన్ ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు ఆయన సైకిలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను ప్రోత్సహించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులకు ఎప్పుడు ఏ సహాయం కావాలన్నా తాను అండగా నిలబడతానని అన్నారు. అనంతరం నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

జిల్లెల్‌గూడలో ఉమామహేశ్వర ఆలయ మహాకుంభాభిషేక వేడుకలు

హైదరాబాద్ జిల్లెల్‌గూడ తిరుమలనగర్‌లోని శ్రీ హరిహర క్షేత్రం ఉమామహేశ్వర స్వామి ఆలయంలో మహాకుంభాభిషేక మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో భాగంగా నేడు జగద్గురువులు సిద్ధలింగ రాజదేశికేంద్ర శివాచార్యుల ఆధ్వర్యంలో యంత్ర, విగ్రహ, ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రేపు మహాకుంభాభిషేకంతో పాటు పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవం జరగనుంది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆలయ కమిటీ కోరింది.

గ్రీస్ నుంచి తిరిగొచ్చి చెరకుతో కోట్లు పండిస్తున్న

పంజాబ్ యువ రైతు

- గ్రీస్‌లో 8 ఏళ్లు పనిచేసి స్వగ్రామానికి తిరిగి వచ్చిన హర్‌గుర్‌జిత్ సింగ్ - సంప్రదాయిక పంటలు వదిలి చెరకు సాగుతో ఏటా రూ. 2 కోట్ల టర్నోవర్
- అధునాతన పద్ధతులతో తక్కువ విత్తనం, నీటితో అధిక దిగుబడి సాధన - వ్యవసాయ యంత్రాలతో ఇతర రైతులకు సేవలు అందిస్తూ అదనపు ఆదాయం
- బహుళ ఆదాయ మార్గాలతో వ్యవసాయాన్ని లాభసాటి వ్యాపారంగా మార్చిన వైనం



జలంధర : చదువు పూర్తి కాగానే మంచి భవిష్యత్తు కోసం విదేశాలకు వెళ్లడం చాలామంది యువత కల. కానీ, విదేశాల్లో సంపాదించిన అనుభవాన్ని, సంపాదనను మూలధనంగా మార్చి, స్వదేశానికి తిరిగి వచ్చి ఇక్కడి మట్టిలోనే బంగారం పండించాలని కొందరే అనుకుంటారు. అలాంటి అరుదైన యువకుడి కథే ఇది. గ్రీస్‌లో ఎనిమిదేళ్లు పనిచేసి, తిరిగివచ్చి పంజాబ్ నేలపై వ్యవసాయాన్ని లాభాల పండుగగా మార్చిన హర్‌గుర్‌జిత్ సింగ్ మిన్హాస్ (36) విజయగాథ ఎందరికో స్ఫూర్తిదాయకం. గ్రీస్ నుంచి పంజాబ్ పొలానికి..: పంజాబ్‌లోని జలంధర్ జిల్లా దరోలి కలాన్ గ్రామానికి చెందిన హర్‌గుర్‌జిత్, 12వ తరగతి పూర్తవగానే ఉపాధి కోసం గ్రీస్‌కు వెళ్లారు. అక్కడ సుమారు ఎనిమిదేళ్ల పాటు వ్యవసాయ రంగంలోనే పనిచేశారు. విదేశీ అనుభవం ఆయనలో కొత్త ఆలోచనలకు బీజం వేసింది. ఐదేళ్ల క్రితం పంజాబ్‌కు తిరిగి వచ్చిన ఆయన, తన కుటుంబానికి చెందిన భూమిలో వ్యవసాయం చేయాలని నిశ్చయించుకున్నారు. అయితే, అందరిలాగా గోధుమ, వరి వంటి సంప్రదాయ పంటల వెంట పరుగెత్తలేదు. తనకున్న విదేశీ అనుభవానికి, వ్యవసాయంపై మరింత పట్టు సాధించడానికి డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ ఫర్ ఇన్‌పుట్ డీలర్స్ కోర్సు పూర్తిచేశారు. ఆ తర్వాత తన ప్రస్థానాన్ని చెరకు సాగుతో ప్రారంభించారు. ఆధునాతన సాగు.. బహుళ ఆదాయం: ప్రస్తుతం హర్‌గుర్‌జిత్ తనకున్న 12 ఎకరాల సొంత భూమితో పాటు, మరో 48 ఎకరాలను ఎకరాకు ఏటా రూ. 35,000 అద్దెకు తీసుకుని మొత్తం 60 ఎకరాల్లో చెరకు సాగు చేస్తున్నారు. ఇందులో 35 ఎకరాలు శరదృతువు నాట్లు కాగా, 25 ఎకరాలు వసంత రాటూన్ పద్ధతిలో సాగు చేస్తున్నారు. కేవలం చెరకుపైనే ఆధారపడకుండా, అందులో అంతర పంటలుగా గోధుమ, పెసలు, ఆవాలు వంటి 7-8 రకాల పంటలు పండిస్తూ అదనపు ఆదాయం గడిస్తున్నారు. ఆయన అనుసరిస్తున్న ట్రెంచ్ పద్ధతి, సింగిల్-ఐ బడ్ టెక్నిక్ వల్ల విత్తన చెరకు ఖర్చు గణనీయంగా తగ్గింది. సాధారణంగా ఎకరానికి 30 క్వింటాళ్ల విత్తనం అవసరమైతే, ఈ పద్ధతిలో కేవలం 1.5 క్వింటాళ్లతోనే సరిపోతుంది. అంతేకాదు, వరితో పోలిస్తే నీటి వినియోగం కూడా సగానికి సగం తక్కువ అని ఆయన గర్వంగా చెబుతారు. ఈ ప్రణాళికతో సొంత భూమిలో ఎకరాకు రూ. 76,000, లీజుకు తీసుకున్న భూమిలో రూ. 41,000 నికర లాభం ఆర్జిస్తున్నారు.

సాగు నుంచి వ్యాపార స్థాయికి..:

హర్‌గుర్‌జిత్ కేవలం రైతుగానే ఆగిపోలేదు, తన ఆలోచనలను వ్యాపారంగా మలిచారు. రూ. 2 కోట్ల భారీ పెట్టుబడితో చెరకు కోత యంత్రం (హార్వెస్టర్), ట్రాలీలు, ట్రాక్టర్లు కొనుగోలు చేశారు. దీనికి ప్రభుత్వం నుంచి రూ. 36 లక్షల సబ్సిడీ కూడా లభించింది. ఈ యంత్రాలతో తన పొలంలో పనులు పూర్తి చేయడమే కాకుండా, చుట్టుపక్కల రైతులకు కోత, రవాణా సేవలు అందిస్తూ మరో ఆదాయ మార్గాన్ని సృష్టించుకున్నారు. గత సీజన్‌లో 45,000 క్వింటాళ్ల చెరకును కోత కోయగా, ఈ ఏడాది ఏకంగా లక్ష క్వింటాళ్లను లక్ష్యంగా పెట్టుకున్నారు. నేడు హర్‌గుర్‌జిత్ చెరకు ఆధారిత వ్యవసాయ వ్యాపారం ద్వారా ఏటా రూ. 2 కోట్లకు పైగా టర్నోవర్ సాధిస్తూ, సుమారు రూ. 60-65 లక్షల నికర లాభాన్ని ఆర్జిస్తున్నారు. సంప్రదాయిక పంటలతో పోలిస్తే ప్రణాళికాబద్ధంగా చెరకు సాగు చేస్తే మూడు రెట్లు అధిక లాభం పొందవచ్చని ఆయన అనుభవం రుజువు చేస్తోంది. విదేశాలకు వెళ్లాలనే ఆలోచనలో ఉన్న యువతకు, వ్యవసాయం దండగ అనే నిరాశలో ఉన్న రైతులకు హర్‌గుర్‌జిత్ సింగ్ మిన్హాస్ ఒక ఆశాకిరణం అనడంలో సందేహం లేదు.

తెల్లవారుజామునే ప్రజారోగ్యం కోసం శ్రమిస్తున్న పారిశుద్ధ్య సిబ్బందితో తేనీటి విందు

నెల్లూరు నగరంలోని 21వ డివిజన్ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచి, ప్రజలకు పరిశుభ్రమైన ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలనే సంకల్పంతో నూతనంగా ఎన్నికైన 21వ డివిజన్ జనసేన కార్పొరేటర్ గునుకుల విజయలక్ష్మి తెల్లవారుజామున 5:30 గంటలకే చిల్డ్రన్స్ పార్క్ వద్ద మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బందిని కలుసుకుని వారితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సిబ్బందితో ఆత్మీయంగా ముచ్చటించి, వారితో కలిసి తేనీరు సేవించారు.ఈ సందర్భంగా డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య సిబ్బందిని పరిచయం చేసుకుంటూ, ఎంతమంది సిబ్బంది విధుల్లో ఉన్నారు? ఎవరు ఏ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్నారు? సిబ్బంది కొరత ఏమైనా ఉందా? పారిశుద్ధ్య పనులకు అవసరమైన పరికరాలు, వాహనాలు అందుబాటులో ఉన్నాయా? ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా? అనే అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జనసేన నాయకులు కిషోర్ గునుకుల మాట్లాడుతూ?"మనమందరం ఉదయం నిద్రలేచే సమయానికే, అంతకంటే ముందుగానే రోడ్లు, వీధులు శుభ్రం చేస్తూ మన దినచర్యను పరిశుభ్రమైన వాతావరణంతో ప్రారంభించేలా చేస్తున్నది మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది. మీరు చేసే సేవ వెలకట్టలేనిది. మీ శ్రమ, అంకితభావానికి హృదయపూర్వక అభినందనలు, కృతజ్ఞతలు."పవన్ కళ్యాణ్ పర్యావరణ పరిరక్షణ ఆశయాలకు అనుగుణంగా, నూతనంగా ఎన్నికైన మన 21వ డివిజన్ కార్పొరేటర్ గునుకుల విజయలక్ష్మి నాయకత్వంలో, అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తున్న మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ సహకారం, మార్గదర్శకత్వంతో 21వ డివిజన్‌ను నెల్లూరు నగరంలో పారిశుద్ధ్యానికి ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతామని తెలిపారు.

"పరిశుభ్రమైన డివిజన్ నిర్మాణం ఒక్కరి బాధ్యత కాదు. ప్రజలు, పారిశుద్ధ్య సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే సాధ్యమవుతుంది. మీ అందరి సహకారంతో అభివృద్ధి ప్రగతి పథంలో 21వ డివిజన్‌ను ముందుకు తీసుకెళ్తాం." అని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ప్రతిరోజూ తెల్లవారుజామునే విధులకు హాజరై ప్రజల ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న పారిశుద్ధ్య సిబ్బందికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. వారితో ఆత్మీయంగా తేనీరు సేవిస్తూ వారి సేవలను అభినందించారు.

ఇంజనీరింగ్ పనుల పురోగతిపై
జోనల్ కమిషనర్ సమీక్ష



శేర్లింగంపల్లి (ప్రశ్న న్యూస్)శేరిలింగంపల్లి జోన్ పరిధిలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ ఐఏఎస్ సమీక్ష నిర్వహించారు. జోనల్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఎస్ఈ, అన్ని సర్కిళ్ల ఈఈలు, డీఈఈలు, ఏఈలు, హెచ్ఓడీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మోడల్ రోడ్లు, కూడళ్ల అభివృద్ధి, క్రీడా ప్రాంగణాలు, 'వర్క్ ఫ్రమ్ పార్క్', 'వన్ వార్డ్ ఎవ్రీ డే' కార్యక్రమాల కింద చేపడుతున్న పనుల పురోగతిని సమీక్షించారు. పూర్తయిన పనులకు సంబంధించిన ఎం.బి. రికార్డులను వెంటనే నమోదు చేయాలని, ప్రతి పనికి సంబంధించిన వివరాలతో పూర్తిస్థాయి బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పనుల వీడియోలను చిత్రీకరించి పీఎంయూకు పంపించాలని సూచించారు.మై క్యూర్ ఫిర్యాదులతో పాటు ఎక్స్, పత్రికల్లో వచ్చే వార్తలు, ప్రజావాణి ఫిర్యాదులను ప్రాధాన్యతతో పరిష్కరించాలని స్పష్టం చేశారు. ప్రతి పనిలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పాదచారుల మార్గాలు, శ్మశాన వాటికలు, కూడళ్ల అభివృద్ధి, ఎడమవైపు మలుపుల సదుపాయాలు, నీరు నిలిచే ప్రాంతాల సమస్యల పరిష్కారానికి మరిన్ని ప్రత్యేక పనులు చేపట్టాలని సూచించారు. ఇటీవల మంజూరైన ఇంకుడు గుంతల నిర్మాణం, విలీన ప్రాంతాల్లో మురుగునీటి కాలువల నిర్మాణ పనులను తక్షణమే క్షేత్రస్థాయిలో ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.

బాలల దినోత్సవం సందర్భంగా ..
ప్రభుత్వ పాఠశాలలో బ్యాగుల పంపిణీ..

ఉప్పట్ల సర్పంచ్ వెంకటమ్మ.



మంథని (ప్రశ్న న్యూస్)బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎం.పి. యు.పి.ఎస్. ఉప్పట్ల పాఠశాలలో ఘనంగా బ్యాగుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య దాతలుగా లయన్స్ క్లబ్ గోదావరిఖని వాసవి వారు విద్యార్థులకు పాఠశాల బ్యాగులను విరాళంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాసిపేట వెంకటమ్మ , వార్డు మెంబర్లు, పంచాయతీ కార్యదర్శి, లయన్స్ క్లబ్ అధ్యక్షులు రాహుల్ సభ్యులు, పాఠశాల విద్యార్థిని విద్యార్థులు ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, పిల్లల చదువుకు సహకరిస్తున్న లయన్స్ క్లబ్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు రాహుల్ మాట్లాడుతూ, భవిష్యత్తులో కూడా పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.బ్యాగులు అందుకున్న విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. చివరగా ప్రధానోపాధ్యాయులు దాతలకు, అతిథులకు ధన్యవాదాలు తెలియజేసినారు

మాజీ ఎంపీపీ అరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్..
కుటుంబాన్ని పరామర్శించిన సర్పంచులు..

జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఎల్లే రామ్మూర్తి..



మంథని (ప్రశ్న న్యూస్) రామగిరి మండలం బుధవారం పేట (రామయ్యపల్లె) గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ అరెల్లి దేవక్క--కొమురయ్య గౌడ్ కుటుంబానికి చెందిన కొమురయ్య గౌడ్, శ్రీనివాస్ గౌడ్‌ల తల్లి గట్టు మల్లమ్మ ఇటీవల అకాల మరణం చెందారు. ఈ నేపథ్యంలో ఈ రోజు పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఎల్లే రామ్మూర్తి మరియు రామగిరి సర్పంచులు లద్నాపూర్ సర్పంచ్ వనం రామచంద్రరావు, సుందిళ్ల సర్పంచ్ ముసుగుల నరేందర్ రెడ్డి, చందనాపూర్ సర్పంచ్ కొండా శ్రీనివాస్, ముత్యాల సర్పంచ్ సుంకరి మహేష్, రామగిరి మండల మాజీ కన్వీనర్ పేరాలకు మహేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ వీరగోని లక్ష్మణ్ గౌడ్, రామగిరి మండలం మాజీ సర్పంచులు రామయ్య పల్లె మాజీ సర్పంచ్ దేవనూరి రజిత శ్రీనివాస్, నాగ పల్లి మాజీ సర్పంచ్ ఎరుకల బుజ్జిబాబు, రామగిరి మండలం విలేజ్ అధ్యక్షులు రామయ్య పల్లె సుందిళ్ల కాంగ్రెస్ పార్టీ విలేజ్ అధ్యక్షులు ప్రవీణ్ గౌడ్, బావు రాయమల్లు, లద్నాపూర్ సింగరేణి కాలరీస్ కంపెనీ ప్రథమ కళాకారుడు అరిగెల నారాయణ గౌడ్, రామగిరి మండలం సీనియర్ నాయకులు యూత్ నాయకులు గొర్రె నరేష్ యాదవ్, గిరవేన రాకేష్ యాదవ్, ప్రసాద్ యాదవ్, అభ్యర్థి సర్పంచ్ కన్నూరు ఓదెలు, భద్రపు శ్రీనివాస్, దొంకేనా రాజబాబు, నాగపెల్లి ఎక్స్ రోడ్ ఆటో యూనియన్ అధ్యక్షులు రాజకుమార్, తదితరులు పాల్గొని ఈ సందర్భంగా గట్టు మల్లమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు

దొంగ బంగారం చూపించి...
అసలు బంగారం కొట్టేశారు

– లాలాగూడలో పాత మహిళా ముఠా అరెస్ట్ – 9½ తులాల బంగారం స్వాధీనం

సికింద్రాబాద్(ప్రశ్న న్యూస్) కూరగాయలు కొనడానికి వెళ్లిన మహిళను మాయమాటలతో మభ్యపెట్టి, మెడలోని బంగారు గొలుసు కొట్టేసిన పాత మహిళా ముఠాను లాలాగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. వీళ్ల చేతిలో మోసపోయింది ఒకరు కాదు, ఇద్దరు కాదు, ఏకంగా 35 కేసుల చరిత్ర ఉన్న ఘరానా దొంగలు.

ఎలా మోసం చేశారంటే..

నవంబర్ 5న రాత్రి 9:30 గంటలకు బాధితురాలు నార్త్ లాలాగూడ కూరగాయల మార్కెట్ కు వెళ్లింది. అక్కడ 40-45 ఏళ్ల మహిళ పరిచయం చేసుకుంది. కింద పడిన పర్సు చూపించి, "అందులో ఏదో ఉంది" అంది. ఇంతలో మరో మహిళ వచ్చి "నా పర్సు పోయింది" అని డ్రామా ఆడింది.
పర్సు తెరిచి చూస్తే అందులో బంగారు బిస్కెట్ "ఇద్దరం పంచుకుందాం" అని మొదటి మహిళ ఆశ చూపించింది. మూడో మహిళ వచ్చి "ఉదయం అమ్మిపెడతా" అంది. నకిలీ బిస్కెట్ ను బాధితురాలి దగ్గర పెట్టి, "దానికి బదులు మీ 2½ తులాల గొలుసు ఇవ్వండి, ఉదయం తిరిగి ఇస్తాం" అని నమ్మించి, గొలుసుతో ఉడాయించారు. ఇచ్చిన ఫోన్ నంబర్ పనిచేయకపోవడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది.

సీసీ కెమెరాలతో పట్టేశారు..

కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ ఫుటేజ్, టెక్నికల్ ఆధారాలతో నిందితులను గుర్తించారు. మళ్లీ నేరానికి వస్తుండగా నవంబర్ 13న లాలాపేట్ కల్లు దుకాణం వద్ద ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు.
చెల్ల నర్సమ్మ (49), రాజేంద్రనగర్ లో18 కేసులు, వేముల లక్ష్మి (43), బోరబండ లో17 కేసులు, కొమెర అంజలి (45), గోల్కొండ,వీరు మార్చి 14న జైలు నుంచి విడుదలై, మళ్లీ యాదగిరిగుట్ట, ఉప్పల్, కుషాయిగూడలో ఇదే తరహా దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నారు.పోలీసులు వీరి నుంచి మొత్తం 9½ తులాల బంగారం స్వాధీనం చేసుకుని, కోర్టు ఆదేశాలతో చంచల్‌గూడ మహిళా జైలుకు తరలించారు. రోడ్డు మీద దొరికిన బంగారం, పర్సు అంటూ ఎవరైనా చెబితే నమ్మొద్దు. అది 100% మోసం. వెంటనే 100కు కాల్ చేయండి.



డీసీపీ రక్షిత కృష్ణ మూర్తి ఆదేశాలతో, ఏసీపీ శశాంక్ రెడ్డి పర్యవేక్షణలో, ఇన్‌స్పెక్టర్ బి. రవికిరణ్, ఎస్.ఐ. కె. మమత, సిబ్బంది ఈ కేసును చేదించారు.

పార్ట్ టైం అధ్యాపకుల సమస్యల పరిష్కారంలో వివక్ష ఎందుకు.?

-ఏళ్ల తరబడి యూనివర్సిటీల భారం మోస్తుంది పార్ట్ టైం అధ్యాపకులే
-యూనివర్సిటీ నియామకాల్లోనూ వివక్షతేనా.?
-సమస్యలు పరిష్కరించే మార్గం లేదా.?
-భారమైన కుటుంబ పోషణతో ఆందోళనకు గురవుతున్న అధ్యాపకులు
-సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని అధ్యాపకుల డిమాండ్

తెలంగాణ రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీలలో పనిచేస్తున్న పార్ట్ టైం, కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యలు నేటికీ పరిష్కారానికి నోచుకోవడం లేదు. గత మూడు దశాబ్దాలుగా వెట్టి చాకిరీ చేస్తూ పస్తులతో తమ కుటుంబాలను మోస్తూ తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ఏళ్ల తరబడి ప్రతి విద్యా సంవత్సరం ఆరంభంలో, ముగింపులోను,తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని యూనివర్సిటీల అధికారులకు, ఉన్నత విద్యా మండలి అధికారులకు మరియు ప్రభుత్వ పెద్దలకు విన్నవించుకున్నా ఏమాత్రం ఉపయోగం లేదు. సమస్యలు పరిష్కరించడంలో యూనివర్సిటీ అధికారులు, ప్రభుత్వం చలనం లేనట్టుగా ప్రవర్తిస్తున్నారు.

యూనివర్సిటీల భారం మోస్తున్న పార్ట్ టైం అధ్యాపకులు..

ప్రస్తుతం యూనివర్సిటీలలో అత్యధిక శాతంగా ఉండి, విశ్వవిద్యాలయాలను తమ ఉన్నతమైన అకాడమిక్ ఆ అర్హతలతో నాణ్యమైన విద్య నందిస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నారు. ప్రస్తుతం తెలంగాణలోని అన్ని యూనివర్సిటీల అనుబంధ కళాశాలలో ప్రవేశాలు పెరుగుతున్నాయి, విద్యార్థులు మొదటి ప్రాధాన్యతగా యూనివర్సిటీలు అనుబంధ కళాశాలలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వటానికి కారణం ఆయా కళాశాలలో పనిచేస్తూ ఉత్తమమైన సేవలను అందిస్తూ,విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నారు.ప్రస్తుతం తెలంగాణ లోని అన్ని యూనివర్సిటీల అనుబంధ కళాశాలలో అత్యధిత శాతం పార్ట్ టైం అధ్యాపకుల ఉత్తమమైన సేవలతోటే నడుస్తున్నాయి.

ఉత్తమ సేవలకు గాను జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు..

విశ్వవిద్యాలయాలు పనిచేస్తున్న 80% పైగా పార్ట్ టైం,కాంట్రాక్టు అధ్యాపకుల ఉత్తమ సేవలు అందిస్తూ,నాణ్యమైన విద్యను బోధిస్తున్న క్రమంలో యూనివర్సిటీలకు, అనుబంధ కళాశాలలకు జాతీయ సంస్థలైన ఛీఔజ,ఖ+జ మరియు వివిధ అంతర్జాతీయ సంస్థలు ఉత్తమ గుర్తింపును పొందుతున్నాయంటే ఆయా కళాశాలలో యూనివర్సిటీ లలో పార్ట్ టైం అధ్యాపకుల సేవలు కీలకంగా మారుతున్నాయి.వీరి సేవలు ప్రశంసనీయమైనవి.

యూనివర్సిటీ విద్య పట్ల ప్రభుత్వాల వివక్ష..

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి యూనివర్సిటీలలో మౌళిక వసతులు కల్పించడం లో ప్రభుత్వాలు వివక్ష చూపుతున్నాయి.రాష్ట్రంలో ఒక వైపు ప్రాథమిక విద్యకు అతి ఎక్కువ ప్రాధాన్యతనిస్తూ సమస్యలను ఉన్నత విద్య పట్ల సవతి తల్లి ప్రేమను ప్రదర్శిస్తున్నాయి.యూనివర్సిటీల విద్యార్థుల కనీస అవసరాలను కూడా తీర్చలేని పరిస్థితులలో యూనివర్సిటీలు తీవ్ర నిర్లక్ష్యానికి గురి అవుతున్నాయి.ప్రస్తుతం యూనివర్సిటీలలో విద్యను అభ్యసించే విద్యార్థులు అధిక శాతం మొదటి తరం గ్రామీణ,పేద మధ్య తరగతి విద్యార్థులే.వీరికి ఉన్నత విద్యను అందించడం లో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుంది. ప్రస్తుతం యూనివర్సిటీలలో కనీస వసతులు కూడా లేవు.విద్యార్థులు చెల్లించే ఫీజుల మీదనే యూనివర్సిటీలు ఆధారపడుతున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామీణ, పేద మధ్య తరగతి విద్యార్థులు ఫీజులు చెల్లించలేక ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు.కాగా విశ్వ విద్యాలయాలలో పని చేస్తున్న పార్ట్ టైం అధ్యాపకులు కూడా మొదటి తరం పేద, మధ్య తరగతుల నుంచి వచ్చిన వారే.వీరు ఉన్నత విద్యను అభ్యసించి ఉత్తమమైన అర్హతలు కలిగి ఉండి పి.హెచ్.డి,నెట్,సెట్ లతో పాటు అత్యున్నత మైన పరిశోధనా అనుభవాలు ఉండి దేశీయ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు కలిగిన జనరల్ లో ఆర్టికల్ ప్రచురిస్తూ,రోజు రోజుకు,నైపుణ్యాలను అభివృద్ధి చేసుకొంటూ నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. అయినప్పటికీ వీరికిచ్చే వేతనాలు అతి తక్కువ స్థాయిలో ఉండటంతో కనీస అవసరాలు కూడా తీసుకోలేక పోతున్నారు.దీంతో వీరి జీవితాల్లో అంధకారం నెలకొంది.

గిగ్ వర్కర్లకు భరోసా సరే.. మా సంగతేంటి..

రాష్ట్రంలోని వివిధ కార్మిక, కర్షక వర్గాల ప్రజలకు సామాజిక, న్యాయం కల్పించేందుకు అనేక సంక్షేమ పథకాలను రూపొందిస్తున్న ప్రభుత్వం వివిధ యూనివర్సిటీలలో అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న పార్ట్ టైం అధ్యాపకుల సమస్యలను పరిష్కరించడంలో విఫలం చెందుతుంది.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయం లో తమ మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన ప్రకారం తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ప్రజా పాలన ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

అత్యంత దయనీయంగా పార్ట్ టైం అధ్యాపకుల జీవితాలు..

రాష్ట్రంలో పని చేస్తున్న పార్ట్ టైం అధ్యాపకుల జీవితాలు అతి తక్కువ వేతనాలు పొందుతూ కుటుంబాల కనీస అవసరాలు తీర్చలేని దయనీయ స్థితిలో జీవిస్తున్నారు.ఈ నేపథ్యంలో వివిధ యూనివర్సిటీల్లో చాలిచాలని వేతనాలతో బ్రతుకు భారమై తీవ్ర మనస్థాపానికి గురవుతున్న అధ్యాపకులు ఆకస్మిక మరణాలకు పాల్పడుతున్నారు. ఇటీవల కాలంలో పలు యూనివర్సిటీల్లో పదుల సంఖ్యలో అధ్యాపకులు మరణించిన సంఘటనలు వీళ్ళ భవిష్యత్తు పట్ల ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఈ అర్ధాకలి బతుకులతో నెల నెలా అప్పు చేస్తూ అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఇలాంటి దయనీయ స్థితిని గడుపుతున్న పార్ట్ టైం ఉపాధ్యాయుల పట్ల కనికరం చూపి ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిష్కార మార్గాన్ని చూపాలి.

యూనివర్సిటీ నియామకాల్లో పార్ట్ టైం అధ్యాపకులకు ప్రాధాన్యతనివ్వాలి..

యూనివర్సిటీలలో అత్యధికంగా బోధన, బోధ నేతర భారాన్ని మోస్తూ యూనివర్సిటీల ఉన్నతికి కృషి చేస్తున్న పార్ట్ టైం అధ్యాపకుల సేవలకు తగిన గుర్తింపు ఇవ్వడమే ప్రభుత్వానికి ముందున్న ప్రధాన లక్ష్యం కావాలి. ఈ నేపథ్యంలో నియామకాల భర్తీ కోసం ఉన్నత విద్యా మండలి తీసుకొచ్చిన జీవో నెంబర్ 31 నిబంధనల లోనూ వీరి పట్ల వివక్షత చూపుతున్నారు.వీరి సర్వీస్ కు వెయిటేజ్ ఇచ్చి గుర్తింపునివ్వాలని కోరుతున్నారు.నియామకాల ముందే వీరి సమస్యలు పరిష్కరించాలి. అప్పుడే వీరి జీవితాల్లో వెలుగులు వికసిస్తాయి. యూనివర్సిటీల్లో సమస్యలు ప్రభుత్వం పరిష్కరించే దిశగా చొరవ చూపాలి.

నోటిఫికేషన్ కు ముందే హామీలు నెరవేర్చాలి..

అనేక సంవత్సరాలుగా తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించుకునే దిశలో వివిధ రూపాలలో తమ గోడును ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతున్నా,అధికారులు సమస్యల పట్ల తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శించడం పట్ల ఆందోళన వ్యక్తం అవుతుంది. ఈ నేపథ్యంలో మానవతా దృక్పథంతో ప్రభుత్వం పార్ట్ టైం అధ్యాపకులకిచ్చిన హామీలను నిలబెట్టుకొని వాటిని పరిష్కరించే దిశగా ప్రయత్నం జరగాలి. అప్పుడే వీరి జీవితాల్లో ఆనందం వెల్లి విరుస్తుంది.

చర్చల ద్వారానే సమస్యలకు పరిష్కారం..

రాష్ట్రంలో వివిధ వర్గాల సమస్యలను చర్చల ద్వారా నే పరిష్కరిస్తున్న ప్రభుత్వం, ఆయా సమస్యలను పరిష్కరించడంలో చొరవ చూపుతున్న అధికారులు ప్రపంచంలో అత్యున్నత మైన విద్యను బోధిస్తున్న విశ్వవిద్యాలయాల పార్ట్ టైం, కాంట్రాక్టు అధ్యాపకుల సంఘాలతో చర్చించి ఉన్నతమైన యూనివర్సిటీ విద్య పట్ల వివక్షత చూపకుండా ఒక ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపించిన తరువాతే యూనివర్సిటీలలో నియామకాలు చేపట్టాలి.



డాక్టర్ జీవన్ పాలడుగు
నిజాం కళాశాల,
ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్
9550678374

విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని
పెంపొందించేందుకు ఆటల పోటీలు

తార్నాక(ప్రశ్న న్యూస్) విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని, శారీరక దృఢత్వాన్ని, క్రమశిక్షణను పెంపొందించాలనే ఉద్దేశంతో నారాయణ సివో స్కూల్ తార్నాక విజయ డైరీ ఆధ్వర్యంలో ప్రీమియర్ లీగ్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జీఎం గోపాల్ రెడ్డి, ఏజీఎం బాలపరమేశ్వరరావు పాల్గొని ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లకు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చదువుతో పాటు ఆటలు కూడా ఎంతో ముఖ్యమని, క్రీడలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. విద్యార్థులు చదువులోనే కాకుండా క్రీడల్లోనూ రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నారాయణ పాఠశాల ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం, ఏఓ వెంకటేష్ తదితరులు పాల్గొని విజేతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు



ఎన్నికల సమగ్రతే ప్రజాస్వామ్య
పరిరక్షణకు పునాది

- భారత్ సమ్మిట్‌లో ఎన్నికల సమగ్రతపై జరిగిన ప్యానెల్ చర్చలో ఎమ్మెల్యే కవ్వంపల్లి

కరీంనగర్ ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షించడంలో ఎన్నికల సమగ్రత కీలక పాత్ర పోషిస్తుందని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు.హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ, హైటెక్స్ వేదికగా జరుగుతున్న భారత్ సమ్మిట్?2026 రెండో ఎడిషన్‌లో భాగంగా శనివారం నిర్వహించిన 'ఎన్నికల సమగ్రత ? తెలంగాణ, భారతదేశం' అనే అంశంపై జరిగిన ప్యానెల్ చర్చలో ఆయన పాల్గొన్నారు.ఈ

ఈ సందర్భంగా కవ్వంపల్లి మాట్లాడుతూ పారదర్శకమైన ఓటరు జాబితాల నిర్వహణ, ఓటర్ల హక్కుల పరిరక్షణ, ఎన్నికల సంఘం స్వతంత్రంగా వ్యవహరించడం వంటి అంశాలపై విస్తృత చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడి ఓటుకు సమాన విలువ ఉంటుందని, ముఖ్యంగా అట్టడుగు వర్గాల ఓటు హక్కులకు ఎలాంటి విఘాతం కలగకుండా చూడాలని పేర్కొన్నారు. తెలంగాణలో సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువలు, అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.ఈ ప్యానెల్ చర్చలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, విద్యా కమిషన్ సభ్యుడు చరకొండ వెంకటేష్ పాటు ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

‘ఛావా’ రికార్డు బద్దలు..

కేవలం 9 రోజుల్లో రూ. 1100 కోట్ల క్లబ్‌లో ‘రామాయణం’!



దర్శకుడు నితేష్ తివారీ తెరకెక్కించిన పౌరాణిక చిత్రం ‘రామాయణం: రైజ్ ఆఫ్ ఎ లెజెండ్’ బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాలతో దూసుకుపోతోంది. విడుదలైన కేవలం తొమ్మిది రోజుల్లోనే ఈ భారీ బడ్జెట్ చిత్రం విక్కీ కౌశల్ నటించిన ‘ఛావా’ సినిమా లైఫ్‌టైమ్ ఇండియా నెట్ కలెక్షన్ల రికార్డును బద్దలు కొట్టింది. తొమ్మిదో రోజు దేశవ్యాప్తంగా రూ. 47.85 కోట్ల నెట్ కలెక్షన్లను రాబట్టడంతో, భారతదేశంలో ఈ సినిమా మొత్తం నెట్ వసూళ్లు రూ. 612.45 కోట్లకు చేరాయి. ఇదే సమయంలో ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా గ్రాస్ వసూళ్లు రూ. 1,100 కోట్లను దాటాయి. ప్రస్తుతం ఈ సినిమా భారతదేశపు గ్రాస్ కలెక్షన్లు రూ. 732.20 కోట్లకు, ఓవర్సీస్ గ్రాస్ కలెక్షన్లు రూ. 378.50 కోట్లకు చేరుకున్నాయి. దీంతో ప్రపంచవ్యాప్తంగా ‘రామాయణం’ మొత్తం గ్రాస్ వసూళ్లు రూ. 1,110.70 కోట్లకు చేరాయి. ఈ చిత్రం ఇంతకు ముందే షారుఖ్ ఖాన్ ‘పఠాన్’ (రూ. 544.28 కోట్లు), రణ్‌బీర్ కపూర్ ‘యానిమల్’ (రూ. 556.36 కోట్లు) సినిమాల లైఫ్‌టైమ్ వసూళ్ల రికార్డులను కూడా వెనక్కి నెట్టింది.వాల్మీకి మహర్షి రామాయణం ఆధారంగా రెండు భాగాలుగా ఈ చలనచిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు.

సీతాదేవిని రక్షించడానికి రాముడు సాగించిన ప్రయాణమే ఈ మొదటి భాగం యొక్క ప్రధాన కథాంశం. నమిత్ మల్హోత్రాకు చెందిన ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్, డిఎన్ఈజి మరియు యశ్ ‘మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్’ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించాయి. ఈ చిత్రంలో రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయిపల్లవి, రావణాసురుడిగా యశ్, లక్ష్మణుడిగా రవి దూబే నటించారు. అలాగే హనుమంతుడి పాత్రలో సన్నీ డియోల్ కనిపించనున్నారు. ఈ సినిమా రెండవ భాగం 2028 దీపావళికి విడుదల కానుంది.

సీనియర్ నటుడు గిరిబాబు కన్నుమూత



తెలుగు చిత్ర పరిశ్రమలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ సీనియర్ నటుడు గిరిబాబు (80) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, హైదరాబాద్ కొండాపూర్ లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నేడు తుదిశ్వాస విడిచారు. ఆయన మృతితో టాలీవుడ్ పరిశ్రమలో విషాద ఛాయలు అలముకున్నాయి. గిరిబాబు పూర్తి పేరు యర్రా శేషగిరిరావు. ఆయన 1946 జూన్ 8న ఉమ్మడి ప్రకాశం జిల్లా రావినూతలలో జన్మించారు. చిన్నతనం నుంచే నాటకాలు, కళారంగంపై ఉన్న ఆసక్తితో ఆయన సినిమా రంగం వైపు అడుగులు వేశారు. 1973లో విడుదలైన ‘జగమే మాయ’ చిత్రంతో ఆయన నటుడిగా వెండితెరకు పరిచయమయ్యారు. ప్రారంభంలో కథానాయకుడిగా కొన్ని సినిమాలు చేసినప్పటికీ, ఆ తర్వాత ప్రతినాయకుడిగా (విలన్), హాస్య నటుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా మారి తనదైన ప్రత్యేక శైలితో ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్నారు. నాలుగు దశాబ్దాలకు పైగా సాగిన తన సినీ ప్రస్థానంలో గిరిబాబు 600కు పైగా చిత్రాల్లో నటించారు. ఎన్టీఆర్, ఏఎన్ఆర్, కృష్ణ, మోహన్ బాబు వంటి అగ్ర కథానాయకులందరితోనూ కలిసి నటించిన అనుభవం ఆయన సొంతం. 1977లో వచ్చిన పౌరాణిక చిత్రం ‘కురుక్షేత్రం’లో దుశ్శాసనుడి పాత్రలో ఆయన చూపిన నటన ప్రేక్షకులకు చిరకాలం గుర్తుండిపోయింది. ఆ తర్వాత జ్యోతి, మెరుపు దాడి, పసివాడి ప్రాణం, బాలగోపాలుడు, హలో బ్రదర్, సిసింద్రి, లిటిల్ సోల్జర్స్, నిన్నే పెళ్లాడతా, చంద్రలేఖ, నువ్వే కావాలి వంటి ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో వైవిధ్యమైన పాత్రలను పోషించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త తరం హీరోల చిత్రాల్లోనూ నటించి మెప్పించారు. మహేశ్ బాబు ‘అతడు’ చిత్రంలో హీరోయిన్ తండ్రిగా ఆయన చేసిన నటన విశేష ఆదరణ పొందింది. అలాగే గమ్యం, అ ఆ, గీత గోవిందం, డిస్కో రాజా, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్, జాతి రత్నాలు వంటి సినిమాల్లో విభిన్న పాత్రలతో చివరి వరకూ ప్రేక్షకులను అలరిస్తూనే ఉన్నారు. గిరిబాబు కేవలం నటుడిగానే కాకుండా దర్శకుడిగా, నిర్మాతగా కూడా పరిశ్రమకు విశేష సేవలందించారు. ఆయన స్వీయ దర్శకత్వంలో ‘రణరంగం’ (1985), ‘ఇంద్రజిత్’ (1990), ‘నీ సుఖమే నే కోరుతున్నా’ (2008) వంటి సినిమాలు తెరకెక్కాయి. అలాగే ‘మెరుపు దాడి’, ‘దేవతలారా దీవించండి’ వంటి పలు చిత్రాలకు నిర్మాతగానూ వ్యవహరించారు. గిరిబాబు మరణం పట్ల సినీ ప్రముఖులు, అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నారు. గిరిబాబుకు ఇద్దరు సంతానం కాగా, పెద్ద కుమారుడు రఘుబాబు ప్రముఖ కమెడియన్ గా కొనసాగుతున్నారు. చిన్న కుమారుడు బోసుబాబు గతంలో ఓ చిత్రంలో నటించారు. గిరిబాబు అర్ధాంగి శ్రీదేవి 2018లో కన్నుమూశారు.

ప్రతీ మహిళా ఇష్టపడే సినిమా



‘విశ్వనాథ్ అండ్ సన్స్’ ‘ఇరుముడి’ వంటి మ్యూజికల్ బ్లాక్‌బస్టర్స్‌తో ఈ ఏడాది సూపర్‌ఫామ్‌లో ఉన్నారు అగ్ర సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్. ఆయన స్వరాల్ని అందించిన తాజా చిత్రం ‘ఆకాశంలో ఒక తార’. దుల్కర్ సల్మాన్ హీరోగా పవన్ సాధినేని దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఈ నెల 20న విడుదలకానుంది. ఈ సందర్భంగా శుక్రవారం మ్యూజిక్ డైరెక్టర్ జీవీ ప్రకాశ్‌కుమార్ విలేకరులతో ముచ్చటిస్తూ సినిమా సంగీత విశేషాల్ని పంచుకున్నారు. ‘లక్కీ భాస్కర్’ తర్వాత దుల్కర్ సల్మాన్‌తో ‘ఆకాశంలో ఒక తార’ చేయడం ఆనందంగా ఉంది. మహిళా సాధికారతను తెలియజెప్పే స్ఫూర్తివంతమైన కథ ఇది. ఈ చిత్రానికి జాతీయ అవార్డులు వస్తాయనే నమ్మకం ఉంది. కుటుంబ ప్రేక్షకులందరికీ ఈ కథ నచ్చుతుంది. కథలోని ఎమోషన్స్‌ను బట్టి మ్యూజిక్‌ను ప్రత్యేకంగా డిజైన్ చేశాను. ఇదొక మోడరన్ క్లాసిక్ సినిమాలా ప్రేక్షకులకు గొప్ప అనుభూతినందిస్తుంది. ప్రతీ మహిళ ఇష్టపడే సినిమా అవుతుంది. ఈ సినిమా కోసం డిఫరెంట్ సౌండ్ డిజైన్ చేశాం. అందుకోసం స్పెషల్ సింథసైజర్స్‌ను ఉపయోగించాం. తప్పకుండా మ్యూజిక్ ఓ యూనిక్ ఫీల్‌ని అందిస్తుంది. ఇందులో మొత్తం ఐదు పాటలున్నాయి. పాటలు, నేపథ్య సంగీతం ఒకదానితో ఒకటి అనుసంధానమై ఉంటాయి. శృతిహాసన్‌తో ఓ పాట పాడించాం. అది త్వరలో విడుదల కాబోతున్నది. మ్యూజిక్, యాక్టింగ్‌ను బ్యాలెన్స్ చేస్తూ కెరీర్‌ను కొనసాగిస్తున్నా. ‘లక్కీ భాస్కర్’, ‘ఇరుముడి’, ‘విశ్వనాథ్ అండ్ సన్స్’ వంటి వరుస విజయాల వల్ల తెలుగులో అవకాశాలు బాగా పెరిగాయి. టాలీవుడ్ ప్రస్తుతం అద్భుతమైన దశలో ఉంది. దర్శకులు కొత్త కాన్సెప్ట్‌తో ముందుకొస్తున్నారు. అందుకే మ్యూజిక్ పరంగా కూడా కొత్తదనం కనిపిస్తున్నది.నేను నటించిన తాజా చిత్రం ఫిబ్రవరిలో రిలీజ్ కాబోతున్నది. అలాగే సెల్వరాఘవన్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నా. ఇక మ్యూజిక్ పరంగా.. తెలుగులో ‘జనవరి 12’ ‘శ్రీశ్రీ’ చిత్రాలతో పాటు ఇటీవల మొదలైన సిద్ధు జొన్నలగడ్డ

ప్రతి విజయం కొత్త ఉత్సాహం



నితీష్ తివారీ దర్శకత్వంలో నమిత్ మల్హోత్రా నిర్మించిన ‘రామాయణం’ వెయ్యికోట్ల వసూళ్లు సాధించింది. అలాగే.. సూర్య ‘సీన్’ చిత్రం విజయపథంలో దూసుకుపోతూ సూర్య కెరీర్‌లోనే హయ్యెస్ట్ రెవెన్యూ సాధిస్తున్నది. ఈ రెండు సినిమాలనూ తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేసింది అగ్ర నిర్మాత దిల్ రాజు కావడం విశేషం. తాను విడుదల చేసిన రెండు సినిమాలూ విజయవంతంగా ప్రదర్శితమవుతున్న సందర్భంగా శుక్రవారం నిర్మాత దిల్‌రాజు హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్‌ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ‘ ‘రామాయణం’ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేసినందుకు గర్వంగా ఉంది. ప్రతి సక్సెస్ నుంచీ ఒక కొత్త ఎనర్జీని తెచ్చుకోవాలి. అదే నా ఫార్ములా. ఇంత సక్సెస్ ఇచ్చిన ప్రేక్షకులకు ధన్యవాదాలు’ అని చెప్పారు దిల్‌రాజు. తాను విడుదల చేసిన మరో సినిమా ‘సీన్’ గురించి మట్లాడుతూ ‘సూర్య ‘సీన్’ని నైజాంలో విడుదల చేశాం. సూర్య నటన, జీతూ మాధవన్ ఎక్స్‌ట్రార్డినరీ స్క్రీన్‌ప్లే వర్కవుట్ అయ్యాయి. సూర్య కెరీర్‌లోనే హయ్యెస్ట్

అరకొర పొగరువే అందమైన సగమువే



కృష్ణ ఓ రచయిత. భార్య అంటే పిచ్చి ప్రేమ. ఆమె పేరు మీదనే కథలు కూడా రాస్తుంటాడు. సజావుగా సాగిపోతున్న వీరి దాంపత్య జీవితంలో ఓ చిన్న సంఘటన అలజడి రేపుతుంది. ఈ నేపథ్యంలో వారి ప్రయాణం ఎలా సాగిందో తెలుసుకోవాలంటే ‘అలియాస్ రుక్మిణి’ చూడాల్సిందే అంటున్నారు మేకర్స్. నితిన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి ‘దండోరా’ ఫేమ్ మురళీకాంత్ దేవసోత్ దర్శకత్వం వహిస్తున్నారు. హీరో నాని సమర్పణలో ఆయన సోదరి దీప్తి గంటా నిర్మిస్తున్నారు. డిసెంబర్ 4న ప్రేక్షకుల ముందుకురానుంది. శుక్రవారం ఈ సినిమా నుంచి ‘పిచ్చి ప్రేమలో నన్నే ముంచుతావే..’ అనే మెలోడీ గీతాన్ని విడుదల చేశారు. విజయ్ బుల్గానిన్ స్వరపరచిన ఈ పాటను కృష్ణకాంత్ రచించారు. కార్తీక్ ఆలపించారు. ‘చిరుచిరు చిలకవే చిన్నెలున్న అలకవే చిత్రమైన మనసువే వయ్యారి, అరకొర పొగరువే అందమైన సగమువే, అల్లుకున్న సొగసువే నా దేవి..పిచ్చి ప్రేమలో నన్నే ముంచుతావే’ అంటూ కొత్తగా పల్లెన జంట మధ్య అనుబంధాన్ని ఆవిష్కరిస్తూ ఈ పాట సాగింది.

‘దాదా’ కోసం హుషారైన గీతం



నందమూరి అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న చిత్రం ‘దాదా’. అగ్ర కథానాయకుడు నందమూరి బాలకృష్ణ హీరోగా మలినేని గోపీచంద్ దర్శకత్వంలో వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్న ఈ మాస్ ఎంటర్‌టైనర్ డిసెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నది. ప్రమోషన్స్‌లో భాగంగా శుక్రవారం ఈ సినిమాలోని తొలి పాట ‘దాదా ధమాకా’ను మేకర్స్ విడుదల చేశారు. పబ్ నేపథ్యంలో సాగే ఈ పాటలో బాలకృష్ణ, నర్గీస్ ఫక్రీ ఫుల్ ఎనర్జీతో కనిపించారు.‘బావలే బావలే బావలే.. ఇక్కడున్నోళ్లంత నాకు సొంత బావలే..’ అంటూ రామజోగయ్యశాస్త్రి రాసిన ఈ పాటను రజనిశ్రీ పూర్ణిమ ఆలపించారు. ఈ పాటలోని కొంత భాగాన్ని బాలకృష్ణ స్వయంగా పాడటం విశేషం. మాస్ బీట్‌తో, క్యాచీ రిధమ్స్‌తో ఫుల్ ఎనర్జిటిక్‌గా తమన్ ఈ పాటను స్వరపరిచారు. శేఖర్ మాస్టర్ నృత్యరీతుల్ని సమకూర్చారు. మాస్ ప్రేక్షకులు మెచ్చేలా ఈ పాట సాగింది. కాజల్ అగర్వాల్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో మంచు మనోజ్

ఆ క్షణంలో కన్నీళ్లు ఆగలేదు!



నటీనటులకు కొన్ని పాత్రలు కేవలం గొప్ప జ్ఞాపకాలను మాత్రమే కాకుండా అంతకుమించిన భావోద్వేగాలను మిగుల్చుతాయి. ముఖ్యంగా ప్రజలు దైవాలుగా కొలిచే పౌరాణిక పాత్రల్ని చేస్తున్నప్పుడు ఆ అనుభూతి చాలా ప్రత్యేకంగా ఉంటుంది. అలాంటి ఓ అరుదైన అనుభవమే అగ్ర కథానాయిక సాయిపల్లవికి ఎదురైంది. ఇటీవల విడుదలైన ‘రామాయణ: రైజ్ ఆఫ్ ఏ లెజెండ్’ చిత్రంలో సాయిపల్లవి సీత పాత్రలో నటించిన విషయం తెలిసిందే. షూటింగ్ సమయంలో ఓ సన్నివేశం పూర్తికాగానే డైలాగ్ కోచ్ వచ్చి తన పాదాలకు నమస్కరించారని, ఆ క్షణంలో తాను భావోద్వేగాన్ని ఆపుకోలేక కన్నీళ్లు పెట్టుకున్నానని సాయిపల్లవి తెలిపారు. ‘మనం ప్రతీ రోజు పూజించే పాత్రను ఎవరైనా పోషిస్తున్నప్పుడు ఆ పాత్ర మీద పూజ్యభావం కలుగుతుంది. ఆమె ఓ సాధారణ మహిళే కదా అనే విషయాన్ని పట్టించుకోం. మనసులో ఉన్న ఆరాధనను వ్యక్తం చేయాలనుకుంటాం. ఆమె నా పాదాలను తాకినప్పుడు తను ఏడవకముందే నేను ఏడ్చాను. ‘మీరు అసలు ఏం చేస్తున్నారు’ అని అడిగాను. అప్పుడే సీతమ్మ పాత్ర ఎంత మంది హృదయాల్లో కొలువై ఉందో అర్థమైంది. ఆమె నాపై చూపించిన ప్రేమకు ఎంతో వినయంగా, భావోద్వేగంతో స్పందించాను’ అని సాయిపల్లవి చెప్పింది. నితేష్ తివారి దర్శకత్వంలో రూపొందిన ‘రామాయణ’ చిత్రం ప్రపంచవ్యాప్తంగా వెయ్యికోట్లకుపైగా వసూళ్లతో దూసుకుపోతున్నది.

95 వాహనాలను అదుపులోకి
తీసుకున్న ట్రాఫిక్ పోలీసులు

-జగిత్యాల టౌన్ సీఐ కరుణాకర్, ట్రాఫిక్ ఎస్సై మల్లేష్ ఆధ్వర్యంలో



జగిత్యాల (ప్రశ్న న్యూస్)జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు, జగిత్యాల డీఎస్పీ పురుషోత్తం రెడ్డి సూచనల ప్రకారం, జగిత్యాల పట్టణ సీఐ కరుణాకర్ ఆధ్వర్యంలో, ట్రాఫిక్ ఎస్సై మల్లేష్, సిబ్బందితో కలిసి జగిత్యాల పట్టణంలో ప్రత్యేక తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా నంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న వాహనాలు, అలాగే మోటార్ వాహనాల చట్ట నిబంధనలకు విరుద్ధంగా నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకున్న వాహనాలను గుర్తించి మొత్తం 95 వాహనాలను అదుపులోకి తీసుకొని, నిబంధనల ప్రకారం జరిమానాలు విధించడం జరిగింది.అనంతరం వాహన యజమానులకు సరైన, ప్రామాణిక నంబర్ ప్లేట్లను ఏర్పాటు చేసుకోవాల్సిన ఆవశ్యకతపై అవగాహన కల్పించి కౌన్సెలింగ్ నిర్వహించారు. పోలీసుల సూచనల మేరకు వాహన యజమానులు స్వచ్ఛందంగా తమ వాహనాలకు ముందు, వెనుక వైపులా నిబంధనలకు అనుగుణంగా కొత్త నంబర్ ప్లేట్లను ఏర్పాటు చేసుకున్నారు.ఈ సందర్భంగా జగిత్యాల పట్టణ సీఐ కరుణాకర్ మాట్లాడుతూ, ప్రతి వాహనానికి తప్పనిసరిగా నిబంధనల ప్రకారం నిర్దేశించిన ప్రామాణిక నంబర్ ప్లేట్లు ఉండాలని, నంబర్ ప్లేట్లు లేకుండా లేదా నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు.ఈ ప్రత్యేక తనిఖీ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై మల్లేష్, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ ప్రపంచాన్ని శాసించేందుకు
సిద్ధమవుతున్న ఇంజినీర్లు

నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో

అత్యాధునిక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) స్థానిక మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో సైబర్ సెక్యూరిటీ విభాగంలో అత్యాధునిక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ను ఘనంగా ప్రారంభించారు.సుప్రజ టెక్నాలజీస్ వారి సౌజన్యంతో, కళాశాల చైర్మన్ జె. నర్సింహారెడ్డి దార్శనికతలో, కార్యదర్శి జె. త్రిశూల్ రెడ్డి సారధ్యంలో, విద్యావేత్త, కళాశాల డైరెక్టర్ డా. ఏ. మోహన్ సమర్థ మార్గదర్శకత్వంలో ఈ సెంటర్ ఏర్పాటైంది.ఇందులో భాగంగా సుప్రజ టెక్నాలజీస్ సిఈఓ.సంతోష్ , సిటిఓ ఉపేంద్ర రెడ్డి సెక్యూరిటీ అనలిస్ట్ రాజ్ హజరయ్యారు. సిఈఓ సంతోష్ మాట్లాడుతూ, మా సంస్థ ప్రతి అప్లికేషన్ కు సెక్యూరిటీ ను అందిస్తుందని, మా పరిశోధనలో ప్రతి అధ్యాపకుడిని, విద్యార్థులను భాగస్వాములను చేస్తామని, ఆలోచన – నైపుణ్యం – జ్ఞానం పంచుకోవడమే మా సూత్రమని తెలిపారు. అనంతరం సుప్రజ టెక్నాలజీస్ సిటిఓ ఉపేంద్ర రెడ్డి మాట్లాడుతూ, మా ప్రధాన దృష్టి పరిశోధన మరియు అభివృద్ధి పైనేనని, విద్యార్థులు కొత్త ఆవిష్కరణలు చేసేలా ప్రోత్సహిస్తాం అని, విద్యార్థులకు అత్యుత్తమ ప్యాకేజ్ తో ప్రాంగణ నియామకాలు జరగాలంటే, ఒక స్కోపస్ ఇండెక్స్డ్ పేపర్ కలిగి ఉండాలని, ఒక పేటెంట్ గ్రాంట్ అయి ఉండాలని సూచించారు. ఇందుకు తమ సహకారం విద్యార్థులకు ఎల్లపుడు ఉంటుందని తెలిపారు. తదుపరి కళాశాల కార్యదర్శి జె త్రిశూల్ రెడ్డి మాట్లాడుతూ, సైబర్ నేరగాళ్ల ఆగడాలను అదుపు చేయాలంటే నేటి సాంకేతికతతో యువత పోటీ పడాలని అందుకు ఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఎంతో దోహదపడుతుందని, ఈ సెంటర్ ద్వారా విద్యార్థులకు కేవలం థియరీ మాత్రమే కాకుండా, ప్రత్యక్ష ప్రాక్టికల్ అనుభవాన్ని పొందగలరని తెలిపారు.ఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేవలం ఒక మౌలిక సదుపాయాల కేంద్రం లేదా పేరుకు మాత్రమే పరిమితమైనది కాదని, ఇది అత్యాధునిక సైబర్ సెక్యూరిటీ టెక్నాలజీలు, ఎథికల్ హ్యాకింగ్ మరియు వాస్తవ ప్రపంచ భద్రతా సవాళ్లపై లోతైన, ప్రాక్టికల్ అనుభవాన్ని అందించేలా రూపొందించబడిందని,ఈ సెంటర్ లో సుమారు ల250 పైగా సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లు మరియు టూల్స్‌లి ను ఇన్‌స్టాల్ చేశారని, ఇవి అధ్యాపకులకు మరియు విద్యార్థులకు అద్భుతమైన అభ్యాస మరియు పరిశోధన వేదికగా నిలుస్తాయని కళాశాల డైరెక్టర్ డా ఏ మోహన్ గారు తెలిపారు.అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డా ఆర్ లోకానాథం గారు మాట్లాడుతు, విద్యార్థులు కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా, లైవ్ సైబర్ అటాక్ లను ఎదుర్కోవడం, సెక్యూరిటీ లోపాలను గుర్తించడం, ఎథికల్ హ్యాకింగ్ టెక్నిక్స్ నేర్చుకోవడం వంటి వాస్తవ అనుభవాన్ని ఈ సెంటర్ ద్వారా పొందాలని, భవిష్యత్తులో సైబర్ రంగంలో నిపుణులుగా ఎదగాలని విద్యార్థులకు హితవు చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జె నర్సింహారెడ్డి కార్యదర్శి జె. త్రిశూల్ రెడ్డి , కోశాధికారి జె. త్రిలోక్ రెడ్డి, డైరెక్టర్ డా. ఏ. మోహన్ ప్రిన్సిపాల్ డా. ఆర్. లోకనాథం , సైబర్ సెక్యూరిటీ విభాగాధిపతి డా. డి. కోటేశ్వర రావు , అధ్యాపకులు, విద్యార్థులు వివిధ విభాగాధిపతులు, పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహనకు జిల్లా కలెక్టర్ చొరవ



మేడ్చల్ (ప్రశ్న న్యూస్)బాలల హక్కులపై సమాజంలో అవగాహన పెంపొందించి, వారి సమస్యల పట్ల ప్రతి ఒక్కరిలో బాధ్యతను పెంచేందుకు మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ చొరవ తీసుకున్నారు. ఈనెల 14 నుంచి 20 వరకు నిర్వహించే బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా, 2026 నవంబర్ 16న “పిల్లల ప్రజావాణి” కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో, యూనిసెఫ్ భాగస్వామ్యంతో కార్యక్రమం నిర్వహించబడుతుంది. సాధారణ ప్రజావాణి జరిగే ప్రాంగణంలో పిల్లల కోసం ప్రత్యేక డెస్క్ ఏర్పాటు చేయనున్నారు. ఈ వేదిక ద్వారా పిల్లలు తమ విద్య, ఆరోగ్యం, పోషణ, రక్షణ, మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాల లబ్ధి తదితర అంశాలకు సంబంధించిన సమస్యలను నేరుగా తెలియజేసి వినతిపత్రాలు సమర్పించవచ్చు. బాల కార్మికత్వం, బాల్య వివాహాలు, వేధింపులు, దోపిడీ వంటి సమస్యలను కూడా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావచ్చు. అందిన వినతులపై సంబంధిత శాఖల సమన్వయంతో తగిన తదుపరి చర్యలు చేపట్టేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుంది.జిల్లాలో పిల్లల సంక్షేమం, సంరక్షణ, సమగ్ర అభివృద్ధి కోసం మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ వివిధ కార్యక్రమాలు, పథకాలను అమలు చేస్తోంది. ఈ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, పిల్లల అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వడం, వారి హక్కుల పరిరక్షణలో సమాజ భాగస్వామ్యాన్ని పెంపొందించడం “పిల్లల ప్రజావాణి” ప్రధాన లక్ష్యం.పిల్లలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ కోరుతోంది.

బస్తీ పిల్లలకు బడే”బాయ్” అండ



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) భారతదేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి నవంబర్ 14వ తేదీన ప్రతి ఏటా మన దేశంలో బాలల దినోత్సవాన్ని అత్యంత ఘనంగా జరుపుకుంటారు. పిల్లలంటే ఎనలేని ప్రేమ, ఆప్యాయత చూపే నెహ్రూను చిన్నారులందరూ ఎంతో ముద్దుగా”చాచా నెహ్రూ”అని పిలుచుకునేవారు.నిజానికి 1964వ సంవత్సరానికి ముందు వరకు,ఐక్య రాజ్యసమితి సూచనల మేరకు ప్రపంచ దేశాలతో పాటు భారతదేశంలో కూడా నవంబర్ 20వ తేదీన బాలల దినోత్సవాన్ని నిర్వహించేవారు.అయితే, 1964 మే 27న నెహ్రూ మరణించిన తర్వాత,పిల్లల పట్ల ఆయనకున్న అమితమైన ప్రేమకు,పిల్లల సంక్షేమానికి ఆయన చేసిన కృషికి గౌరవసూచకంగా ఆయన పుట్టినరోజైన నవంబర్ 14ను అధికారికంగా బాలల దినోత్సవంగా జరుపుకోవాలని భారత పార్లమెంట్ ఏకగ్రీవ తీర్మానం చేసింది.తోటలోని మొగ్గల్లాంటి పిల్లలను ఎంతో ప్రేమగా,జాగ్రత్తగా పెంచితేనే దేశ భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుంది.పిల్లల హక్కులను కాపాడటం,బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడం ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య,పోషకాహారం అందించడం ఈ దినోత్సవం యొక్క ప్రధాన ఉద్దేశం.అందుకే ఈ ప్రత్యేకమైన రోజున ప్రభుత్వం అందించే ప్రోత్సాహంతో పాటు, స్థానిక నాయకులు,దాతలు ముందుకు వచ్చి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విద్యా సామగ్రిని అందించడం ఎంతో అభినందనీయం.పేద విద్యార్థుల చదువులకు ఆటంకం కలగకుండా చేయూతనివ్వడం ద్వారానే చాచా నెహ్రూ ఆశయాలకు నిజమైన నివాళి అర్పించినట్లు అవుతుంది. విద్యార్థి దశ అనేది జీవితానికి బలమైన పునాది లాంటిదని,ఈ సమయంలో అలవర్చుకునే క్రమశిక్షణ మంచి అలవాట్లే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుస్తాయి. చదువుతో పాటు ఆటపాటలు, క్రీడలు, సృజనాత్మక కళలలో కూడా చురుగ్గా పాల్గొనడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసం కలుగుతుంది.పుస్తక పఠనాన్ని ఒక నిత్య అలవాటుగా మార్చుకోవాలని, తద్వారా లోకజ్ఞానం పెరిగి ఏది మంచి,ఏది చెడు అనే విచక్షణ జ్ఞానం అలవడుతుంది.ప్రస్తుతం ఆధునిక సమాజంలో మొబైల్ ఫోన్లు,టీవీలకు ఎక్కువగా బానిసలు కాకుండా విజ్ఞానాన్నిపెంచే అంశాలపైనే దృష్టి పెట్టాలి. తల్లిదండ్రులను, గురువులను,పెద్దలను గౌరవిస్తూ,తోటి విద్యార్థులతో స్నేహభావంతో మెలిగితే సమాజంలో ఉత్తమ పౌరులుగా ఎదుగుతారు, ఏదైనా విషయంలో సందేహాలు వచ్చినప్పుడు భయపడకుండా ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకొని,ఓటమి ఎదురైనప్పుడు కుంగిపోకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి అలాగే దేశం గర్వించే శాస్త్రవేత్తలుగా, నాయకులుగా,నిజాయితీ గల పౌరులుగా ఎదిగి తమ తల్లిదండ్రులకు చదువుకున్న పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు, ఎన్ ఎస్ యు ఐ కంటోన్మెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు ఆదిత్య యాదవ్ పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో నిన్న సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఉన్న అన్ననగర్ లో “బాలజ్యోతి గవర్నమెంట్ స్కూల్”లో పిల్లలకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మహేష్ యాదవ్ -వార్డు 3 అధ్యక్షులు, పరమేష్ బాలాంరాయ్, అన్ననగర్ మురళి, మహమ్మద్ అస్గర్, శివ ముదిరాజ్, జేపీ బాబు, పెద్ద నాగరాజ్, యశ్వంత్ – వార్డు 3 యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, విష్ణు, సాయి, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాపై ఫిర్యాదు

- సర్వే నంబర్ 66లో ఆక్రమణలపై విచారణ చేపట్టాలి

- హద్దులు నిర్ణయించి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని ఎమ్మార్వోకు వినతి





మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ పట్టణంలోని ప్రభుత్వ భూముల పరిరక్షణపై వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. మేడ్చల్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 66లో ఉన్న ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని ఆరోపిస్తూ, ఆ భూమిని కాపాడాలని కోరుతూ చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్ వివిధ కుల సంఘాల ప్రతినిధులతో కలిసి మేడ్చల్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.మేడ్చల్ టీటీడీ కల్యాణ మండపం సమీపంలో, సీఎంఆర్ షాపింగ్ మాల్ వెనుక ఉన్న ప్రభుత్వ భూమిని దబిల్‌పూర్‌కు చెందిన మాజీ మేడ్చల్ మండల ఎంపీపీ భర్త రాజమల్లా రెడ్డి ఆక్రమించి షెడ్డు నిర్మించినట్లు శ్రీనివాస్ గౌడ్‌తో పాటు కుల సంఘాల ప్రతినిధులు ఆరోపించారు.సర్వే నంబర్ 66లోని ఈ భూమి గతంలో కుంటకు సంబంధించిన స్థలంగా ఉందని, అనంతరం టీటీడీ తిరుపతి దేవస్థానం అభివృద్ధి అవసరాల కోసం కొంత భూమిని కేటాయించినట్లు వారు పేర్కొన్నారు. టీటీడీ ఆధ్వర్యంలో కేటాయించిన భూమిలో కొంత మేరకు ప్రహరీ గోడ నిర్మించగా, మిగిలిన స్థలం ఖాళీగా ఉందని తెలిపారు. ఈ ఖాళీ స్థలాన్ని పక్కనే ఉన్న భవన యజమాని దారి పేరుతో ఆక్రమించి షెడ్డు నిర్మించినట్లు ఆరోపించారు.ఈ వ్యవహారంపై రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి సర్వే నంబర్ 66లోని ప్రభుత్వ భూమిని సమగ్రంగా సర్వే చేయాలని వారు కోరారు. భూమి హద్దులను స్పష్టంగా గుర్తించి, హద్దు రాళ్లు ఏర్పాటు చేయడంతో పాటు ఆక్రమణలు జరిగినట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకుని ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాలని వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని కుల సంఘాల ప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ కుల సంఘాల ప్రతినిధులతో పాటు కుమ్మరి లింగం, సత్తయ్య, బాలు, ఒగ్గు భాస్కర్, నర్సింహ, ఎల్.వి. శైలేందర్ తదితరులు పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డల ఉన్నత చదువులకు
హెచ్ఏఎల్ చేయూత

– బాచుపల్లిలో గురుకుల బాలికల డిగ్రీ కళాశాల నూతన భవనం ప్రారంభం

– విద్యతోనే పేదరికంపై విజయం.. ప్రపంచస్థాయి నైపుణ్యాలు అందించాలి– సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి



మేడ్చల్ (ప్రశ్న న్యూస్)పేదింటి ఆడబిడ్డల కలలకు విద్యతో రెక్కలు తొడిగే బృహత్తర కార్యక్రమానికి హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) శ్రీకారం చుట్టింది. సంస్థ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో బాచుపల్లిలో నిర్మించిన తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, డిగ్రీ కళాశాల నూతన భవనాన్ని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శనివారం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదరికం ప్రతిభకు అడ్డుకాకూడదని, నాణ్యమైన విద్యతోనే జీవితాల్లో శాశ్వత మార్పు సాధ్యమని పేర్కొన్నారు.

760 మంది బాలికలకు బంగారు భవిష్యత్తు..

ఈ విద్యాసంస్థ ద్వారా సుమారు 760 మంది బాలికలకు ఆరో తరగతి నుంచి డిగ్రీ వరకు ఒకే ప్రాంగణంలో నాణ్యమైన విద్య, వసతి సౌకర్యాలు అందించడం అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అణగారిన వర్గాల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు కృషి చేస్తోందన్నారు. డేటా సైన్స్, బిజినెస్ అనలిటిక్స్ వంటి ఆధునిక కోర్సులతోపాటు కోడింగ్, డిజిటల్ నైపుణ్యాల్లో శిక్షణ ఇవ్వడం విద్యార్థినులకు భవిష్యత్తులో విస్తృత అవకాశాలను కల్పిస్తుందని చెప్పారు.

విద్యార్థినులు ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదగాలి..

హెచ్ఏఎల్ నిర్మించే విమానాలు దేశాన్ని ఆకాశంలో ఎగరేస్తే.. ఈ విద్యాసంస్థ పేదింటి ఆడబిడ్డల ఆశయాలను ఉన్నత శిఖరాలకు చేరుస్తుందని మంత్రి అన్నారు. విద్యార్థినులు ఐఏఎస్ అధికారులు, శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు, పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఉద్యోగాల కోసం ఎదురుచూసే స్థాయి నుంచి ఇతరులకు ఉద్యోగాలు కల్పించే స్థాయికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. విద్యతోపాటు వ్యక్తిత్వ వికాసం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించేలా అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.

గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి గుగులోతు రవి మాట్లాడుతూ..ఐ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ భారీగా నిధులు ఖర్చు చేస్తోందన్నారు. గురుకుల విద్యార్థిని మాలావత్ పూర్ణ ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించడం విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని గుర్తుచేశారు. బాలికల విద్యాభివృద్ధికి హెచ్ఏఎల్ అందించిన సహకారాన్ని అభినందించారు.

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ మాట్లాడుతూ.. పేదరికం నుంచి ఎన్నో కష్టాలను అధిగమించి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ క్యాబినెట్ హోదాకు ఎదగడం ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు.

ఈ కళాశాలలో చదివే విద్యార్థినులు ఉన్నత స్థానాలకు చేరుకుని దేశ, సమాజ అభివృద్ధికి దోహదపడాలని సూచించారు. హెచ్ఏఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె. రవి మాట్లాడుతూ.. పేద విద్యార్థినుల విద్యాభివృద్ధికి భవన నిర్మాణంలో భాగస్వాములు కావడం తమ సంస్థకు గర్వకారణమన్నారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించి, ఉత్తమ సమాజ నిర్మాణానికి తోడ్పడాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్య జీవితానికి అందించే అత్యంత విలువైన, శాశ్వతమైన సంపద అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో హెచ్ఏఎల్ డైరెక్టర్ (హెచ్ఆర్) డాక్టర్ ఎం.జి. బాలసుబ్రహ్మణ్యం, డైరెక్టర్ (ఫైనాన్స్) అండ్ సీఎఫ్ఓ డాక్టర్ బరేన్య సేనాపతి, డైరెక్టర్ (ఇంజినీరింగ్ అండ్ ఆర్ అండ్ డీ) అజయ్ కుమార్ శ్రీవాస్తవ, డైరెక్టర్ (ఆపరేషన్స్) పి.బి. రంగారావు, జీఎం (హెచ్ఆర్) ఎస్.ఎస్. చాందేల్, ఏవీ మురళీకృష్ణ (ఏడీ), ఉమా ఎన్. రావు (చీఫ్ ఆఫ్ ప్రాజెక్ట్స్), చీఫ్ మేనేజర్ సత్యనారాయణ, ఎస్సీ అభివృద్ధి శాఖ వీసీ అండ్ ఎండీ మల్లయ్య భట్టు, మంత్రి వై. జె .విజయ్ కుమార్ , ప్రిన్సిపల్ డాక్టర్ ఇష్రత్, జాయింట్ సెక్రటరీ సక్రు నాయక్, హెచ్ఏఎల్, గురుకుల సంస్థల అధికారులు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అక్రిడేషన్ కొనుక్కో.. రిపోర్టర్ అయిపో

- జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల జారీలో భారీ అక్రమాల ఆరోపణలు
- రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు పలికిన కార్డులు.?
- వార్తలు రాసే సత్తా ఉన్నవారు 10 శాతమేనా.?
  వసూళ్లకు పాల్పడేవారు 90 శాతమంటూ విమర్శలు
- నకిలీ విలేకరుల ఏరివేతలో సమాచార శాఖ పూర్తిగా విఫలమైందా.?
- అర్హతలు లేని వారికి అంగట్లో సరుకుగా మారిన అక్రిడేషన్ కార్డులు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) జర్నలిస్టు కావాలంటే వార్తలు రాయడం, ప్రజా సమస్యలపై అవగాహన ఉండడం, క్షేత్రస్థాయిలో సమాచారాన్ని సేకరించడం ఒకప్పుడు ప్రాథమిక అర్హతలుగా ఉండేవి. కనీసం ఇంటర్ పాసై, డిగ్రీ పూర్తి చేసిన వాళ్లు మంచి అవగాహన కలిగిన వాళ్లు మాత్రమే వార్తలు రాసి రిపోర్టర్లుగా చలామణి అయ్యేవారు. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో సంస్థ ఐడి లేదా అక్రిడేషన్ కార్డు చేతిలో ఉంటే చాలు రిపోర్టర్‌గా చలామణి కావచ్చనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అర్హతలు, అనుభవం, వృత్తి నిబద్ధత అసలు లేకున్నా కేవలం పలుకుబడి, పైరవీలు, అక్రమ లావాదేవీలకు పాల్పడుతున్న వాళ్లకే రిపోర్టర్లుగా ప్రాధాన్యత లభిస్తోందన్న ఆరోపణలు జర్నలిస్టు వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు బేరాలు.?

అక్రిడేషన్ కార్డుల జారీ ప్రక్రియలో రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు చేతులు మారాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిజాయితీగా జర్నలిజం చేస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తున్న అనేకమంది అర్హులైన జర్నలిస్టులకు కార్డులు దక్కకపోగా, అసలు వార్తలు రాయడం, సమాచారాన్ని సేకరించడం తెలియని చాలా మంది వ్యక్తులు మాత్రం అక్రిడేషన్ కార్డులు పొందారనే విమర్శలు ఉన్నాయి. నిజమైన జర్నలిస్టులు అక్రమ మార్గంలో కార్డులు కొనుగోలు చేయకపోవడంతో కనీస అవగాహన లేని ప్రభుత్వ అధికారులు కొంతమంది నిజమైన రిపోర్టర్లను అక్రడేషన్ కార్డు లేదని నకిలీ విలేకరులుగా చిత్రీకరిస్తున్నారు. వార్తలు రాసే వాళ్ళు అక్రిడేషన్ కార్డు కొనుక్కోకపోవడంతో నకిలీ రిపోర్టర్ లంటూ ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. కొందరు మాత్రం సులభంగా కార్డులు సంపాదిస్తున్నారనే ఆవేదన వ్యక్తమవుతోంది.

వార్తలు రాయరు.. వసూళ్లకే ప్రాధాన్యత

శంషాబాద్, జవహర్‌నగర్, ఎల్బీనగర్, శేర్లింగంపల్లి తదితర ప్రాంతాలతో పాటు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కొందరు వ్యక్తులు జర్నలిజం అర్థం తెలియకుండా పత్రికల పేరుతో గుర్తింపు కార్డులు, అక్రిడేషన్ కార్డులు సంపాదించి వాటిని అడ్డుపెట్టుకుని వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వార్తలు రాయడం రాదు. ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదు. అధికారుల నుంచి సమాచారం సేకరించే ప్రయత్నం చేయడం తెలియదు. కేవలం స్థానిక పోలీస్ స్టేషన్లో కూర్చుని సెటిల్మెంట్లు చేయడానికి కొంతమంది ఐడి కార్డులను ఉపయోగించుకుంటున్నారు. కానీ ఎక్కడ ఏ వ్యాపారం జరుగుతోంది.? ఎవరిని బెదిరిస్తే డబ్బులు వస్తాయి.? తోటి రిపోర్టర్లను ఎలా అనగదొక్కాలి అనే ధోరణితో కొందరు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. కొత్త పత్రికల పేరుతో గుర్తింపు కార్డులు పొందుతూ జర్నలిజం ముసుగులో వ్యక్తిగత ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తున్నారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి.

పదో తరగతి అర్హత కూడా లేని వారికి కార్డులా.?

అక్రిడేషన్ మంజూరులో విద్యార్హతలు, అనుభవం, ప్రచురిత వార్తలు, వృత్తిపరమైన ప్రమాణాలను ఎంతవరకు పరిశీలించారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పదో తరగతి కూడా చదవని వారికి సైతం అక్రమ మార్గాల్లో అక్రిడేషన్ కార్డులు మంజూరయ్యాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపితేనే వాస్తవాలు బయటపడతాయి. అర్హతలను పక్కనపెట్టి కార్డులు జారీ చేయడంలో సమాచార శాఖ అధికారులు, జిల్లా ప్రజాసంబంధాల అధికారులు (డీపీఆర్వోలు) బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రెస్ అకాడమీ చుట్టూ పైరవీల పర్వం.?

ప్రెస్ అకాడమీ చైర్మన్‌తో పాటు ఆయనకు అనుబంధంగా ఉన్న జర్నలిస్ట్ సంఘాల సిఫార్సుల మేరకు చాక్లెట్లు పంచినట్లు అక్రిడేషన్ కార్డులు జారీ చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రిడేషన్ అనేది జర్నలిస్టుల వృత్తిపరమైన గుర్తింపు మాత్రమే కాకుండా, ప్రభుత్వ సమాచారాన్ని పొందేందుకు ఉపయోగపడే అధికారిక గుర్తింపు. అలాంటి కార్డుల జారీ విషయంలో పారదర్శకత లేకపోతే వ్యవస్థపై ప్రజలకు నమ్మకం ఎలా కలుగుతుంది.? అర్హులైన జర్నలిస్టులను పక్కనపెట్టి అనర్హులకు అవకాశం కల్పించారన్న ఆరోపణలకు సమాచార శాఖ అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

అక్రిడేషన్ పొందిన వారందరికీ రాత పరీక్షలు పెట్టాలి

అక్రిడేషన్ కార్డులు పొందిన ప్రతి ఒక్కరికీ జర్నలిజంపై ప్రాథమిక అవగాహన పరీక్షలు ప్రతి జిల్లా డీపీఆర్వోల సమక్షంలో నిర్వహించాలని జర్నలిస్టు వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. వార్తా రచన, వార్తా సేకరణ, ప్రజా సమస్యలు, రాజ్యాంగ విలువలు, పత్రికా నైతికత, మీడియా చట్టాలపై పరీక్షలు నిర్వహిస్తే అసలు జర్నలిస్టులెవరో, గుర్తింపు కార్డులు కొనుక్కొని వెనుక దాక్కున్నవారెవరో స్పష్టమవుతుందని జర్నలిస్టు సంఘాలు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నాయి. కార్డుల మంజూరు ప్రక్రియను పారదర్శకంగా పరిశీలించి, నిబంధనలకు విరుద్ధంగా పొందిన కార్డులను వెంటనే రద్దు చేసి వాటిని జారీ చేసిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాయి.

కోర్టు మెట్లు ఎక్కేందుకు జర్నలిస్టు సంఘాల సిద్ధం

అక్రిడేషన్ కార్డుల జారీ ప్రక్రియలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అనేక అవకతవకలపై ఆధారాలతో సహా న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు కొన్ని జర్నలిస్టు సంఘాలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. అర్హులైన జర్నలిస్టులకు న్యాయం చేయడంతో పాటు అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకునే వరకు పోరాటం కొనసాగిస్తామని సంఘాల ప్రతినిధులు స్పష్టం చేశారు.

ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలి

అక్రిడేషన్ కార్డు, సంస్థ ఐడి కార్డ్ అనేది వసూళ్లకు ఉపయోగపడే ఆయుధం కాదు.. ప్రజల తరఫున ప్రశ్నించే జర్నలిస్టుకు ఇచ్చే గుర్తింపు. ఆ గుర్తింపు వ్యవస్థను కొందరి స్వార్థ ప్రయోజనాలకు వేదికగా మారనివ్వకూడదు. సమాచార శాఖ కమిషనర్, ఉన్నతాధికారులు తక్షణమే సమగ్ర విచారణ చేపట్టి, అర్హతల ఆధారంగా అక్రిడేషన్ కార్డుల జారీపై శ్వేతపత్రం విడుదల చేయాలి. లేదంటే నిజమైన జర్నలిస్టులకు అన్యాయం జరగడమే కాకుండా, మొత్తం జర్నలిజం వ్యవస్థ పరువు బజారున పడే ప్రమాదం ఉందని మీడియా వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడి ఇంటి వద్ద బోర్‌వెల్ వివాదం

- డొమెస్టిక్ అనుమతితో హాస్టల్‌కు బోరు, పబ్లిక్ రోడ్డుపై 1,000 అడుగుల తవ్వకాలు
- కె. రవీందర్ పేరుతో అనుమతి.. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ నాయకుడు సత్యనారాయణ
- ఐదు అంతస్తుల భవనం హాస్టల్‌గా వినియోగం.. బిల్డింగ్ పర్మిషన్ ఉందా.?
- రోజుకు 10 వేల లీటర్ల నీటికి అనుమతి, వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారా.?
- భూగర్భ జలవనరుల శాఖ, మున్సిపల్ అధికారులకు సవాల్‌గా మారిన వ్యవహారం





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రభుత్వ నిబంధనలు సామాన్యులకేనా.? రాజకీయ పలుకుబడి ఉన్నవారికి ప్రత్యేక మినహాయింపులున్నాయా.? భూగర్భ జలాల పరిరక్షణ కోసం ప్రభుత్వం ఆంక్షలు విధిస్తున్న తరుణంలో, హైదరాబాద్‌లోని గడ్డిఅన్నారం పరిధిలో చోటుచేసుకున్న బోర్‌వెల్ తవ్వకాల వ్యవహారం పలు అనుమానాలకు తావిస్తోంది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కుకుట్లపల్లి సత్యనారాయణ నివాసం వద్ద బోర్‌వెల్ తవ్వకాలు చేపట్టడం, డొమెస్టిక్ అవసరాల కోసం అనుమతి తీసుకుని హాస్టల్ అవసరాల కోసం బోరు ఏర్పాటు చేసినట్లు క్షేత్రస్థాయిలో గుర్తించడం, పబ్లిక్ ప్రాపర్టీ అయిన రోడ్డుపై సుమారు 800 నుంచి 1,000 అడుగుల లోతు వరకు తవ్వకాలు చేపట్టడం వంటి అంశాలు చర్చనీయాంశంగా మారాయి. దీనికి తోడు ఐదు అంతస్తుల భవనాన్ని హాస్టల్‌గా వాణిజ్యపరంగా వినియోగిస్తున్నట్లు గుర్తించిన నేపథ్యంలో భవన నిర్మాణ అనుమతులపైనా ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

డొమెస్టిక్ అనుమతి.. హాస్టల్ అవసరాలకు బోరు

తెలంగాణ ప్రభుత్వ భూగర్భ జలవనరుల శాఖ, రంగారెడ్డి జిల్లా కార్యాలయం నుంచి జిల్లా భూగర్భ జల అధికారి ఎస్. మాధవరావు జారీ చేసిన అనుమతి పత్రం ఈ వ్యవహారంలో కీలకంగా మారింది. కె. రవీందర్ పేరుతో గడ్డిఅన్నారం గ్రామం, సరూర్‌నగర్ మండలం, సర్వే నంబర్లు 39--42, ఇంటి నంబర్ 13-7-110/1లోని 306 చదరపు గజాల స్థలానికి సంబంధించి బోర్‌వెల్ ద్వారా రోజుకు 10 ఖూణ అంటే 10 వేల లీటర్ల భూగర్భ జలాలను వినియోగించుకునేందుకు అనుమతి ఇచ్చారు. 30.10.2026న సమర్పించిన ఫారం-5 దరఖాస్తును పరిశీలించిన అనంతరం అనుమతి మంజూరు చేసినట్లు పత్రంలో పేర్కొన్నారు. అంతేకాకుండా 'xఅటఖీర్‌తీబఖీబతీవ జూబతీజూశీంవ శీఅశ్రీఎ' అని స్పష్టమైన షరతు విధించారు. అయితే అనుమతి తీసుకున్న ప్రయోజనం, క్షేత్రస్థాయిలో బోర్‌వెల్ ఏర్పాటు చేసిన ప్రయోజనం మధ్య వ్యత్యాసం ఉందా.? డొమెస్టిక్ అవసరాల కోసం తీసుకున్న అనుమతిని హాస్టల్ నిర్వహణకు సంబంధించిన నీటి అవసరాలకు వినియోగిస్తున్నారా.? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అనుమతి పత్రంలో పేర్కొన్న ప్రయోజనానికి మించి నీటిని వినియోగించేందుకు సంబంధిత శాఖ అనుమతి ఇచ్చిందా లేదా అన్నది అధికారులు తేల్చాలి.

పబ్లిక్ రోడ్డుపైనే వెయ్యి అడుగుల తవ్వకం..

ఈ వ్యవహారంలో మరో ముఖ్యమైన అంశం ప్రభుత్వ ప్రజా ఆస్తి అయిన రోడ్డుపై బోర్‌వెల్ తవ్వకాలు చేపట్టడమే. సుమారు 800 నుంచి 1,000 అడుగుల లోతు వరకు బోర్‌వెల్ తవ్వినట్లు క్షేత్రస్థాయిలో గుర్తించిన ఈ ఘటనపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రైవేటు స్థలానికి సంబంధించిన అనుమతి పత్రం ఉన్నప్పటికీ, పబ్లిక్ రోడ్డుపై బోర్‌వెల్ తవ్వకాలు చేపట్టేందుకు ఎవరు అనుమతించారు? సంబంధిత మున్సిపల్ శాఖ నుంచి రోడ్డు తవ్వకాలకు ప్రత్యేక అనుమతి తీసుకున్నారా.? ప్రజల రాకపోకలకు ఉపయోగపడే రహదారిపై వ్యక్తిగత అవసరాల కోసం తవ్వకాలు చేపట్టే అధికారం ఎవరిచ్చారు.? రోడ్డు పునరుద్ధరణకు బాధ్యత ఎవరిది.? అనే ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంది. రోడ్డు తవ్వకాలపై ఎలాంటి అనుమతులు తీసుకోకపోతే బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఐదు అంతస్తుల భవనం.. హాస్టల్ నిర్వహణకు అనుమతులున్నాయా.?

ఇదే ప్రాంగణంలో మరో ఆసక్తికరమైన అంశం వెలుగులోకి వచ్చింది. నివాస అవసరాల కోసం నిర్మించినట్లు కనిపిస్తున్న భవనాన్ని హాస్టల్‌గా వాణిజ్యపరంగా వినియోగిస్తున్నట్లు క్షేత్రస్థాయి పరిశీలనలో గుర్తించారు. ఐదు అంతస్తులుగా ఉన్న ఈ భవనానికి వాస్తవంగా ఎన్ని అంతస్తులకు అనుమతి మంజూరైంది.? భవన నిర్మాణ అనుమతి డొమెస్టిక్ కేటగిరీలో తీసుకున్నారా.? లేక కమర్షియల్ లేదా హాస్టల్ వినియోగానికి ప్రత్యేక అనుమతులు పొందారా.? నివాస భవనాన్ని హాస్టల్‌గా మార్చేందుకు టౌన్ ప్లానింగ్ శాఖ నుంచి అనుమతి తీసుకున్నారా.? భవనానికి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఉందా.? అగ్నిమాపక భద్రత, పార్కింగ్, ఇతర భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా.? అనే అంశాలపై సమగ్ర విచారణ జరగాల్సి ఉంది. ఐదు అంతస్తుల నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా.? అనుమతించిన ప్లాన్‌కు విరుద్ధంగా అదనపు నిర్మాణాలు చేపట్టారా.? అనే విషయాలను భవన నిర్మాణ అనుమతి పత్రాలు, క్షేత్రస్థాయి కొలతల ఆధారంగా అధికారులు నిర్ధారించాలి.

అనుమతి పొందిన వ్యక్తి ఒకరు.. తవ్వకాల వద్ద కనిపించింది మరొకరు

భూగర్భ జలవనరుల శాఖ అనుమతి పత్రంలో కె. రవీందర్ పేరు ఉండగా, బోర్‌వెల్ తవ్వకాలు జరుగుతున్న సమయంలో అక్కడ కుకుట్లపల్లి సత్యనారాయణ కనిపించడం మరో చర్చకు దారితీసింది. ఆయన విజిటింగ్ కార్డు ప్రకారం ఎల్బీనగర్ నియోజకవర్గం బి. బ్లాక్స్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. బోర్‌వెల్ తవ్వకాల సమయంలో ఆయన అక్కడ ఉన్న దృశ్యాలు వార్తా సంధ్య ప్రతినిధి వద్ద ఉన్న వీడియోలో నమోదయ్యాయి. అనుమతి పొందిన వ్యక్తి, బోరు వేయించిన వ్యక్తి, హాస్టల్ నిర్వహణకు బాధ్యులైన వ్యక్తుల మధ్య సంబంధం ఏమిటి.? బోరు నీటిని ఎవరు వినియోగిస్తున్నారు.? అనుమతి పొందిన వ్యక్తి పేరుతో మరొకరు నీటిని వినియోగిస్తున్నారా.? అనే అంశాలను అధికారులు విచారణలో భాగంగా నిర్ధారించాలి.

మూడు శాఖలు.. సమాధానం చెప్పాల్సిన ప్రశ్నలు

ఈ వ్యవహారంపై జిల్లా భూగర్భ జలవనరుల శాఖ, సంబంధిత మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగం, రహదారుల నిర్వహణకు బాధ్యత వహించే అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయి విచారణ చేపట్టాలి. బోర్‌వెల్ అనుమతి ఏ ప్రయోజనం కోసం ఇచ్చారు.? హాస్టల్ అవసరాలకు నీటిని వినియోగించేందుకు అనుమతి ఉందా? పబ్లిక్ రోడ్డుపై బోర్‌వెల్ తవ్వకాలకు అనుమతి ఎవరిచ్చారు? ఐదు అంతస్తుల భవనానికి పూర్తి నిర్మాణ అనుమతులు ఉన్నాయా.? డొమెస్టిక్ భవనాన్ని హాస్టల్‌గా వాణిజ్యపరంగా నిర్వహించేందుకు అవసరమైన అనుమతులు పొందారా.? అనే అంశాలపై అధికారిక నివేదిక వెల్లడించాలి.ప్రభుత్వ నిబంధనలు, అనుమతులు, ప్రజా ఆస్తుల పరిరక్షణ విషయంలో ఎలాంటి పక్షపాతం లేకుండా అధికారులు వ్యవహరించాలి. అనుమతి పత్రంలోని షరతులకు విరుద్ధంగా నీటి వినియోగం, రహదారిపై అనధికార తవ్వకాలు లేదా భవన నిర్మాణ నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు విచారణలో తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. రాజకీయ పలుకుబడి ఉన్నా, సామాన్య వ్యక్తి అయినా చట్టం ముందు అందరూ సమానమే. ప్రభుత్వ అనుమతులు ఒక ప్రయోజనం కోసం తీసుకుని మరో ప్రయోజనానికి వినియోగిస్తున్నారనే ఆరోపణలపై అధికారులు మౌనం వీడి వాస్తవాలను ప్రజల ముందు ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బాల్యం భగవంతుడిచ్చిన అమూల్యమైన వరం




పటన్‌చెరు (ప్రశ్న న్యూస్) జన్మించిన ప్రతి ఒక్కరు అనుభవించే బాల్యం భగవంతుడు ఇచ్చిన అమూల్యమైన వరమని కామధేను ఫౌండేషన్ అధ్యక్షులు పి. వెంకటేష్ అన్నారు. అభం శుభం



తెలియని పసి మనసులు పూతోటలో పరిమళించిన పువ్వులని అభివర్ణించారు. ఇందుకు గాను ప్రపంచ వ్యాప్తంగా ఆయా దేశాలలో నవంబర్ 14 ను బాలల దినోత్సవంగా జరుపుకోవడం సంప్రదాయంగా మారిందని గుర్తు చేశారు. శనివారం నాడు బాలల దినోత్సవం సందర్భంగా సంగారెడ్డి జిల్లా, ముత్తంగిలో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల బీసీ హాస్టల్లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న పి. వెంకటేష్ మాట్లాడుతు బాలల హక్కుల పరిరక్షణ, విద్య, ఆరోగ్యం, రక్షణ, పిల్లల సంక్షేమం గురించి ప్రపంచ వ్యాప్తంగా అవగాహన కల్పించడమే బాలల దినోత్సవం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంస్కృతిక, క్రీడల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు వాలీబాల్, కబడ్డీ ఆటల్లో మంచి ప్రతిభను కనబరిచారు. అలాగే దేశభక్తి గీతాలు ఆలపిస్తు అందుకు అనుగుణంగా లయబద్దంగా చేసిన విద్యార్థుల నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా ఆర్‌సిఓ శ్రీనివాస్, పాఠశాల ప్రిన్సిపాల్ హరిత తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులు దిగుతుండగా నౌక బోల్తా

- ట్యాంకర్ ఢీకొట్టడంతో నీట మునిగిన నౌక



న్యూ ఆర్లియన్స్ (ప్రశ్న న్యూస్) అమెరికాలోని న్యూ ఆర్లియన్స్‌లో మిసిసిపీ నదిలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. 129 మంది ప్రయాణికులతో ఉన్న ఓ విహార నౌకను భారీ ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టడంతో నౌక పాక్షికంగా నీట మునిగింది. ఈ ఘటనలో డజన్ల కొద్దీ ప్రయాణికులు గాయపడగా, వారిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోర్ట్ ఆఫ్ న్యూ ఆర్లియన్స్ అధికారుల కథనం ప్రకారం స్థానిక కాలమానం ప్రకారం నిన్న మధ్యాహ్నం 12:30 గంటలకు 'అట్లాంటిక్ ఆస్ఫాల్ట్' అనే ట్యాంకర్, 'అమెరికన్ హెరిటేజ్' అనే విహార నౌకను ఢీకొట్టింది. ప్రమాదానికి రెండు గంటల ముందే క్రూయిజ్ నౌక ఒడ్డుకు చేరుకుని, ప్రయాణికులను కిందకు దించడం ప్రారంభించింది. ఈ సమయంలో నియంత్రణ కోల్పోయిన ట్యాంకర్ వేగంగా వచ్చి క్రూయిజ్ షిప్‌ను ఢీకొట్టింది. దీంతో నౌక నెమ్మదిగా మునిగిపోవడం ప్రారంభించి, ఆ తర్వాత పూర్తిగా బోల్తా పడింది. ఈ హఠాత్ పరిణామంతో పలువురు ప్రయాణికులు నదిలో పడిపోయారు. న్యూ ఆర్లియన్స్ మేయర్ హెలెనా మోరెనో మాట్లాడుతూ "నౌకలోని ప్రయాణికులందరినీ గుర్తించాము. వారిలో 32 మంది స్థానిక ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఎవరికీ ప్రాణాపాయం లేదు" అని స్పష్టం చేశారు. సమాచారం అందిన వెంటనే పోర్ట్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, కోస్ట్‌గార్డ్, వైద్య బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. లైఫ్ జాకెట్లతో ఉన్న పలువురిని నది నుంచి సురక్షితంగా బయటకు తీశారు. ముందు జాగ్రత్త చర్యగా మిసిసిపీ నదిలో నౌకల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. 2015లో నిర్మించిన 'అమెరికన్ హెరిటేజ్' నౌక ఐదు అంతస్తులను కలిగి ఉండి, 150 మంది ప్రయాణికులను తీసుకెళ్లే సామర్థ్యం ఉంది. మరోవైపు 160 మీటర్ల పొడవున్న 'అట్లాంటిక్ ఆస్ఫాల్ట్' ట్యాంకర్ తారు, బిటుమెన్ వంటి వాటిని రవాణా చేస్తుంది. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదని, ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని అధికారులు తెలిపారు. నౌకను నిర్వహిస్తున్న అమెరికన్ క్రూయిజ్ లైన్స్ ఈ ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.

రాహుల్ గాంధీ హామీలన్నీ గాలి మాటలే

- డిక్లరేషన్ల అమలు ఏమైందో ప్రజలకు చెప్పాలని డిమాండ్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రకటించిన గిగ్ వర్కర్ల సంక్షేమ పథకంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాహుల్ గాంధీ నోట పలికేవన్నీ గాలి మాటలేనని ఆయన విమర్శించారు. గిగ్ వర్కర్లకు ఆరోగ్య భద్రత కల్పిస్తామని రాహుల్ గాంధీ చెప్పడం పెద్ద జోక్ అని ఎద్దేవా చేశారు. శనివారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన బండి సంజయ్, కాంగ్రెస్ పార్టీ తీరుపై నిప్పులు చెరిగారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలు ఇప్పటివరకు గాలి మూటలుగానే మిగిలిపోయిన మాట వాస్తవం కాదా? అని బండి సంజయ్ ప్రశ్నించారు. గతంలో కాంగ్రెస్ ఇచ్చిన వరంగల్, కామారెడ్డి డిక్లరేషన్‌ల అమలు ఏమైందో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత హామీలను నెరవేర్చకుండా పక్కనపెట్టేసి, ఇప్పుడు కొత్తగా మరో హామీ ఇవ్వడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని ఆరోపించారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న ఆరోగ్యశ్రీ పథకానికి నిధులు సరిగ్గా కేటాయించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని బండి సంజయ్ ఆరోపించారు. ప్రభుత్వ, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో పాటు జర్నలిస్టులకు ఇచ్చిన హెల్త్ కార్డులు కూడా ఆసుపత్రులలో సరిగ్గా పనిచేయడం లేదని ఆయన గుర్తుచేశారు. ఉన్న పథకాలకే దిక్కులేకుండా చేసి, కొత్తగా గిగ్ వర్కర్లకు బీమా, ఆరోగ్య భద్రత కల్పిస్తామంటే ఎవరూ నమ్మే పరిస్థితుల్లో లేరని సంజయ్ స్పష్టం చేశారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588